Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు
# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 146 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

మంగళవారం, 16 - 12 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## మూడు దేశాల పర్యటన.. బయల్దేరిన ప్రధాని మోదీ




**న్యూఢిల్లీ :** భారత ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం మూడు దేశాల పర్యటనకు వెళ్లారు. వెస్ట్ ఆసియా, ఆఫ్రికాలలో కీలక భాగస్వామ్యులైన జోర్డాన్, ఇథియోపియా, ఒమన్ దేశాల్లో పర్యటించనున్నారు. ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపర్చుకోవటంలో భాగంగా ఆయన ఈ దేశాల్లో పర్యటించనున్నారు. మొదట జోర్డాన్‌లోని హషెమెట్ కింగ్ డమ్ వెళతారు. అమన్ పర్యటనలో భాగంగా కింగ్ అబ్దుల్లా 2 ఐబిన్ అల్ హుస్సేన్, ప్రధాన మంత్రి జఫార్ హాసన్, యువరాజు అల్ హుస్సేన్ బిన్ అబ్దుల్లా 2తో సమావేశం కానున్నారు. జోర్డాన్‌లోని భారత కమ్యూనిటీని ఆయన కలవనున్నారు. జోర్డాన్ పర్యటన ముగిసిన తర్వాత ఇథియోపియా వెళతారు. ప్రధాన మంత్రి అబి అహ్మద్ అలీ ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ ఇథియోపియాకు వెళుతున్నారు. ప్రధాని మోదీ ఫెడరల్ డెమోక్రటిక రిపబ్లిక్ ఆఫ్ ఇథియోపికాకు వెళ్లటం ఇదే మొదటిసారి. ఆడిస్ అబాబలో ప్రధాని మోదీ, అబి అహ్మద్‌లు సమావేశం కానున్నారు. అక్కడి భారతీయులను కలిసి ముచ్చటించనున్నారు. ఇథియోపియా పార్లమెంట్ ఉభయ సభల్లో మోదీ పాల్గొననున్నారు. ఇండియా, ఇథియోపియా అనుబంధం గురించి మాట్లాడనున్నారు. చివరగా ఒమన్ దేశంలో ఆయన పర్యటిస్తారు. మస్కట్‌లో ప్రధాని మోదీ ఒమన్ సుల్తాన్‌తో చర్చలు జరపనున్నారు. రెండు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మెరుగుపర్చటం.. కమర్షియల్, ఎకనామిక్ కోఆపరేషన్‌ను విస్తృతం చేయటం గురించి చర్చించుకోనున్నారు. తర్వాత ఒమన్ లోని భారతీయులతో ప్రధాని మోదీ మాట్లాడతారు.

**మోదీ పర్యటనకు బ్రేక్..**

ప్రధాని మోదీ మూడు దేశాల పర్యటనకు బయలుదేరడానికి ముందు అనుకోని విధంగా స్వల్పంగా బ్రేక్ పడింది. ఈ ఉదయం 8.30 గంటల ప్రాంతంలోనే ఆయన మూడు దేశాల పర్యటను బయలు దేరాల్సి ఉండింది. అయితే, ఢిల్లీలో పొగమంచు ఎక్కువగా ఉం టంతో మోదీ పర్యటనకు బ్రేక్ పడింది. ఇందిరా గాంధీ అంతర్జాతీయ (ఐజీఐ) విమానశ్రమంలో పొగమంచు కారణంగా తక్కువ విజబిలిటీ సమస్య ఏర్పడింది. దీంతో ప్రధాని మోదీ విమానం అక్కడినుంచి బయలు దేరడానికి అంతరాయం ఏర్పడింది. గంట తర్వాత ఆయన జోర్డాన్ బయలు దేరినట్లు తెలుస్తోంది.

## సచివాలయ ఉద్యోగులపై పని భారం తగ్గించండి : సీఎంకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి లేఖ



**అమరావతి, (రాజధాని వార్తలు):** గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఎన్నికల బూత్ స్థాయి అధికార విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని సీఎం చంద్రబాబు నాయుడుకి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం సీఎం చంద్రబాబు నాయుడుకి ఆయన లేఖ రాశారు. 16 రకాల సర్వేలతోపాటు ఎన్నికల విధుల పనిభారంతో సచివాలయ ఉద్యో గులు తీవ్ర అనారోగ్యం పాలవుతున్నారని ఈ లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. పని ఒత్తిడితో 2 నెలల్లో నలుగురు సచివాలయ ఉద్యోగులు మరణించడం బాధాకరమని పేర్కొన్నారు. కర్నూలు జిల్లాలో 600 మందికి పైగా సచివాలయ ఉద్యోగులకు షోకాజు నోటీసులు జారీ చేయడం దుర్మార్గమన్నారు. సచివాలయ ఉద్యోగులపై పని భారం తగ్గించాలని సీఎం చంద్రబాబుకు ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య సూచించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లోని సచివాలయం, వార్డులలో విధులు నిర్వహించే ఉద్యోగులు తీవ్ర పని ఒత్తిడికి గురవుతున్నారు. ఈ కారణంగా వారు తీవ్ర అనారోగ్యం బారిన పడుతున్నారు. దాంతో ఆకస్మిక గుండెపోటుతో వారు మరణిస్తున్నారు. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబుకు సీపీఐ నేత ఈశ్వరయ్య లేఖ రాశారు.


## కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో లోకేష్ కీలక భేటీ.. చర్చించిన అంశాలివే...



**న్యూఢిల్లీ :** ఢిల్లీ పర్యటనలో మంత్రి నారా లోకేష్ బిజీబిజీగా ఉన్నారు. పలువురు కేంద్రమంత్రులను కలుస్తూ రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చిస్తున్నారు. అలాగే కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో మంత్రి లోకేష్ సమావేశమయ్యారు. వివిధ ప్రాజెక్టులపై చర్చించారు. ఏపీలో నైపుణ్య గణనకు సహకారం అందించాలని కేంద్ర మంత్రిని కోరారు. రాష్ట్రంలో నైపుణ్య గణన కోసం అత్యాధునిక ఏఐ టెక్నాలజీతో రూపొందించిన నైపుణ్యం పోర్టల్ గురించి కేంద్రమంత్రికి వివరించారు. మంగళగిరిలో నిర్వహించిన పైలెట్ ప్రాజెక్ట్, అందులో ఎదుర్కొన్న సమస్యలు అధిగమించడానికి ఏఐ ఆధారిత ఇంటర్వ్యూ విధానం తీసుకొచ్చామని తెలిపారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే నైపుణ్య గణనకు కేంద్ర సహాయం కావాలని లోకేష్ కోరారు. దీనిపై కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ సానుకూలంగా స్పందించారు. అలాగే రాష్ట్రంలో యువ పారిశ్రామిక వేత్తలు, ఔత్సాహిక వ్యవస్థాపకులకు అద్భుతమైన వేదికగా ఏర్పాటు చేసిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు MeitY స్టార్టప్ హబ్ మద్దతుగా నిలవాలని కేంద్రమంత్రిని విజ్ఞప్తి చేశారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో AVGC-XR, WAVEX ఫ్రేమ్‌వర్క్ కింద InnoXR యానిమేషన్, AR/VR, Immersive Technologies కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు సహకారం అందించాలన్నారు. ఇండియా ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్) మిషన్ కింద రాష్ట్రంలో ఏఐ విస్తృతి వేగవంతానికి మద్దతుగా నిలవాలని కేంద్ర మంత్రిని మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. మంత్రి లోకేష్ వెంట కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, ఎంపీలు ఉన్నారు.

## అయోధ్య ఉద్యమ నేత, మాజీ ఎంపీ రామ్‌విలాస్ వేదాంతి కన్నుమూత

**లక్నో:** విశ్వహిందూ పరిషత్ సీనియర్ నేత, బీజేపీ నాయకుడు, ప్రతాప్‌గఢ్ లోక్‌సభ మాజీ ఎంపీ రామ్ విలాస్ వేదాంతి సోమవారం నాడు కన్నుమూశారు. శ్వాస సంబంధిత సమస్యలతో మధ్యప్రదేశ్‌లోని రేవా జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. వేదాంతి వయస్సు 67 సంవత్సరాలు. అయోధ్యలో రామ జన్మభూమి ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో వేదాంతి కీలక భూమిక పోషించారు. పలు ర్యాలీలు, కార్యక్రమాలతో ప్రజామద్దతును కూడగట్టారు. ప్రతాప్ గఢ్ పార్లమెంటరీ నియోజకవర్గానికి కూడా ఆయన ప్రాతినిధ్యం వహించారు. 1998 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ రాజ్‌కుమారి రత్న సింగ్‌ను 68,460 ఓట్ల ఆధిక్యంతో ఓడించారు.



**సంతాపాల వెల్లువ**

వేదాంతి మృతికి పలువురు ప్రముఖుల నుంచి సంతాపాలు వెల్లువెత్తాయి. సనాతన ధర్మానికి ఆయన చేసిన సేవలు శ్లాఘనీయమని, ఆయన మృతి సనాతన ధర్మానికి తీరని లోటని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తమ సంతాప సందేశంలో తెలిపారు. వేదాంతి కన్నుమూయడంతో ఒక శకం ముగిసిందన్నారు. ఆయన తన జీవితాన్నంతా దేశం కోసం, మతం, సమాజం కోసం అంకితం చేశారని గుర్తు చేసుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని, ఆయన అనుయాయులందరికీ ఈ సమయంలో గుండెనిబ్బరం ప్రసాదించాలని శ్రీరాముని ప్రార్థిస్తున్నట్టు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. భారతీయ సమాజం, రామభక్తులకు వేదాంతి మృతి తీరని లోటని మధ్యప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి రాజేంద్ర శుక్లా సంతాపం తెలిపారు. రుషిత్వం, దేశభక్తి, మతం పట్ల అంకితభావానికి వేదాంతి జీవితమే నిదర్శనమని అన్నారు. ఆయన ఆలోచనలు, పోరాటం లక్షలాది మంది రామభక్తుల్లో ఒక స్ఫూర్తిగా నిలుస్తుందని చెప్పారు. వేదాంతి మృతి బాధాకరమని, ఆయన లేని లోటు తీరదని బీజేపీ ఎంపీ గణేశ్ సింగ్ నివాళులర్పించారు. రామజన్మభూమి ఉద్యమం కోసం ఆయన తన జీవితాన్ని అంకితం చేశారని, రామభక్తులందర్నీ ఏకతాటిపైకి తెచ్చారని గుర్తు చేసుకున్నారు.

## కవి కలీముల్లా సామాజిక వ్యాసం : సయ్యద్

సయ్యద్ అనే పదం చాలా మంది ఒక వంశం అనో,ఒక వర్గం అనో, కులం అనో భావిస్తారు. కానీ ఇది నిజం కాదు.ఇస్లాంలో కులవ్యవస్థకు తావే లేదు. సయ్యద్ అనే పదానికి నాయకుడు, ముఖ్యుడు అనే అర్థాలు వస్తాయి. ఆ రోజుల్లో సమాజానికి దశ, దిశ నిర్దేశం చేస్తూ నాయకత్వం చేసే ముఖ్యులను సయ్యద్ అని పిలిచేవారు. ఇది పుట్టుక నుండి సంక్రమించేది కాదు..ప్రవృత్తిని బట్టి సంక్రమించేది. ఈ పదాన్ని వారి ప్రవృత్తిని చూసి పిలిచే బిరుదు వంటిది..ఉదాహరణకు సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ పేరునే తీసుకోండి. ఆ రోజుల్లో అరబ్బులలో షేఖుల్ని కూడా వారి ప్రవృత్తికి సంబంధించిన ఘనతను బట్టి సయ్యద్ అని పిలిచేవారు. ప్రాథమికంగా ఇస్లాం మనుషులంతా ఒక్కటే అని, పరస్పరం సహోదరులని చెప్తుంది. పుట్టుక రీత్యా మీలో ఏ ఒక్కరు అధికులు, అల్పులు కాదని స్వయానా దైవ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం బోధించారు. అంతేగాక వంశాలు,గోత్రాల ఘనతలన్నీ నా పాదాల క్రింద తొక్కి వేశాను.వాటిని మీరు వెలికి తీయకండి అని తన అనుచర సమాజాన్ని హెచ్చరించారు.మన దేశంలో చుట్టూ ఉన్న కులవ్యవస్థే ముస్లిం సమాజంలో ఉన్నదని చాలామంది అపోహ పడుతుంటారు. దీనికి ముస్లిం సమాజం కూడా మినహాయింపు కాదు. అనేకమంది సయ్యదులంటే ఉన్నతులని, పౌరోహిత్య వర్గమని ముస్లిమేతరులు భావిస్తుంటారు..ఇది సత్యదూరం. ఎందుకంటే ఇస్లాంలో పూజారి వ్యవస్థ లేదు. పేష్ ఇమాం అంటే పూజారి కాదు.. షేఖులైనా, పఠాన్లయినా, సయ్యదులైనా మరే నామకరణం కలిగిన వారైనా ఇమాం బాధ్యత నిర్వహిస్తారు..ఫలానా వారే చేయాలనే నియమం లేదు.. దీనిని బట్టి ఇస్లాంలో పుట్టుకను అనుసరించి బాధ్యతలు ఉండవు.అతని నిజాయితీ, సామర్థ్యం అనుసరించి ఇవ్వబడతాయి..కనుక ఎవరైనా సయ్యదులు ఉన్నతులు అని భావిస్తే వారు దైవాజ్ఞను, ప్రవక్త బోధను తిరస్కరించినట్లే...భారత దేశంలో తొంభై శాతం ముస్లింలు శూద్ర, దళిత కులాల నుండి మతాంతీకరణ చెందిన వారే. తమ తమ ఆసక్తులను బట్టి వారు తమ పేరు ముందు షేఖ్, పఠాన్, సయ్యద్, మొఘల్ అని పెట్టుకున్నారు..ఇవన్నీ పరస్పర పరిచయం కోసమే తప్ప ఇస్లాంలో వీటికి ఎట్టి ఘనత లేదు. "తెల్లవారికి నల్లవారిపై గానీ, నల్లవారికి తెల్ల వానిపై గానీ, అరబ్బులకు, అరబ్బేతరులపై గానీ అరబ్బేతరులకు అరబ్బులపై గాని ఎలాంటి ఆధిక్యత లేదు. మీరంతా సమానులే.

**-దైవ ప్రవక్త ముహమ్మద్ (స).**

## గ్రామీణ ఉపాధిపై కొత్త చట్టం.. లోక్‌సభకు ప్రతిపాదిత బిల్లు



**ఇంటర్నెట్ డెస్క్:** గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో కేంద్రం తీసుకొచ్చిన పథకమే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం. ప్రస్తుతం.. కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని రద్దు చేసి, దీని స్థానంలో కొత్త పథకాన్ని ప్రవేశపెట్టే దిశగా కీలక ముందడుగు వేసింది. 'ది వికసిత్ భారత్.. గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవక మిషన్ గ్రామీణ్' పేరిట నూతన స్కీమ్‌ను ప్రతిపాదిస్తూ.. సంబంధిత బిల్లును లోక్‌సభకు పంపింది. ఇది ఆమోదం పొందినట్లయితే.. ఎమ్ఎన్ఆర్ఈజీఏ స్థానంలో రానుంది. కొత్త పథకం ప్రకారం.. పని దినాల సంఖ్య 125 రోజులకు పెరగనుంది. గతంలో 100 రోజుల పని మాత్రమే ఉండేది. తొలుత ఈ పథకం NREGAగా 2005లో అమలులోకి వచ్చింది. కాగా అప్పటి యూపీఏ ప్రభుత్వం 2009 అక్టోబర్ 02 నుంచి దేశవ్యాప్తంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (MGNREGA) గా పేరు మార్చింది. ఈ పథకం కింద.. ప్రతి గ్రామీణ నిరుపేద కుటుంబానికి ఒక ఆర్థిక ఏడాదిలో 100 రోజుల ఉపాధి పొందే హక్కు ఉంటుంది. దీని పనితీరును పరిశీలించేందుకు 2022లో ఓ ప్రత్యేక కమిటీని నియమించింది ఎన్డీఏ ప్రభుత్వం. ఆ కమిటీ తన నివేదికను గతేడాది ప్రభుత్వానికి సమర్పించింది. కమిటీ నివేదిక ప్రకారం.. 2024-25 ఏడాదిలో ఈ పథకం కింద ప్రతి కుటుంబం సగటున 50 రోజుల ఉపాధిని పొందాయి. 40.7 లక్షల కుటుంబాలు మాత్రమే 100 పని దినాలు పూర్తి చేశాయి. ఇక.. ప్రస్తుత ఆర్థిక ఏడాదిలో కేవలం 6.74 లక్షల కుటుంబాలే ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకున్నాయి. గతంలో.. ఈ పథకం కింద అందించే ఉపాధి రోజులను పెంచాలని ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ సహా అనేక రాష్ట్రాలు కేంద్రాన్ని డిమాండ్ చేశాయి. గతేడాది.. 290 కోట్ల వ్యక్తిగత పని దినాలతో ఆయా రాష్ట్రాలు తమ సొంత బడ్జెట్‌ను ఉపయోగించి రూ.4.35 కోట్లతో తక్కువ పని దినాలను కల్పించాయి. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, హిమాచల్ ప్రదేశ్, కేరళ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, తెలంగాణా వంటి రాష్ట్రాలు సొంత వనరులను వినియోగించుకుని ఎక్కువ పనిని సృష్టించుకోగలిగాయి.

## పాత స్టైఫండ్‌ను పెంచాలని విజ్ఞప్తి

**విజయవాడ/అమరావతి, (రాజధాని వార్తలు):** గత ప్రభుత్వం 5800 మంది పోలీసు కానిస్టేబుళ్లను నియమించినట్లు మా దృష్టికి వచ్చింది. వివిధ కోర్టు కేసుల పరిష్కారం తర్వాత, వారు ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో తమ 9 నెలల శిక్షణకు సిద్ధంగా ఉన్నారు. ప్రస్తుతం వారికి రూ. 4500.00 నామమాత్రపు స్టైఫండ్ చెల్లిస్తున్నారు. దీనిని 13 సంవత్సరాల క్రితం నిర్ణయించారు. గత 13 సంవత్సరాలలో ప్రభుత్వ, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరి జీతాలు సుమారు 3 రెట్లు పెరిగాయి. హోంగార్డులకు కూడా రూ. 21000.00 చెల్లిస్తున్నారు. కానీ పోలీసు శిక్షణార్థులకు ఇచ్చే స్టైఫండ్‌ను మాత్రం పాత పద్ధతిలోనే రూ. 4500.00 గానే ఉంచారు.

మీరు గమనించినట్లయితే, వారికి భోజనం ఖర్చులు నెలకు 6000, ఇతర శిక్షణ, ఇతరత్రా ఖర్చుల కోసం నెలకు రూ. 10000.00 కంటే ఎక్కువ ఖర్చు అవుతుంది. ఈ నేపథ్యంలో హోం శాఖ స్టైఫండ్‌ను కనీసం నెలకు రూ. 12500.00కు పెంచాలని ప్రభుత్వానికి ఒక విజ్ఞప్తి చేసింది, ఇది ప్రస్తుతం ప్రభుత్వం పరిశీలనలో ఉంది. ఈ పోలీసు శిక్షణార్థులు ఒంటరివారు కాదు, వారికి కుటుంబాలు కూడా ఉన్నాయి. హోంగార్డుల వేతనానికి సమానంగా, అంటే రూ. 21000.00 నెలవారీ స్టైఫండ్ చెల్లించాలని శిక్షణార్థులు ప్రార్థిస్తున్నారు.

# దివ్యాంగుల్లోని ప్రతిభను వెలికి తీయడమే సక్షమ్ ప్రధాన లక్ష్యం

**- నెల్లూరు టౌన్ హాల్‌లో సక్షమ్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా దివ్యాంగుల సమ్మేళనం - జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో పాల్గొన్న విభిన్న ప్రతిభావంతులు**

**- దివ్యాంగులను ఉద్దేశించి ప్రోత్సహిస్తూ మాట్లాడిన వక్తలు, ముఖ్య అతిథులు - ఉత్తమ విభిన్న ప్రతిభావంతులను ఘనంగా సత్కరించిన సక్షమ్ నిర్వాహకులు**













**నెల్లూరు, (రాజధాని వార్తలు):** దివ్యాంగుల్లోని ప్రతిభను వెలికి తీయడంతో పాటు వారి అవసరాలను గుర్తించి సక్షమ్ (సమదృష్టి క్షమత వికాసం మరియు అనుసంధానం మండలి) ఆధ్వర్యంలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సక్షమ్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ రఘురామయ్య తెలియజేశారు. నెల్లూరు టౌన్ హాల్‌లో శనివారం సక్షమ్ ఆధ్వర్యంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలలో భాగంగా అంగరంగ వైభవంగా దివ్యాంగుల సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో దివ్యాంగులు విచ్చేసి సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా టౌన్ హాల్ నుంచి వి ఆర్ సి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ ప్రతిమకు పూలమాలలు వేసి నినాదాలు చేశారు. అనంతరం టౌన్ హాల్‌లో దివ్యాంగుల సమ్మేళనం కార్యక్రమాన్ని చేపట్టారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన దివ్యాంగులకు అవసరమైన బస్సు పాసులు ట్రైన్ పాస్‌లను అందజేశారు. అలాగే పలువురు దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, వీల్ చైర్లు, ఇయర్ రింగ్ మిషన్లు, చేతి కర్రలతోపాటు పలు రకాల ఉపకరణాలు పంపిణీ చేశారు. అలాగే జిజిహెచ్ సూపరిండెండెంట్ డాక్టర్ మాధవి ఓ దివ్యాంగుడికి వీల్ చైర్‌ను అందజేశారు. తదనంతరం సమావేశ ప్రారంభం సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి విభిన్న ప్రతిభావంతులను అభినందిస్తూ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ క్రమంలో పలు రంగాల్లో ప్రతిమ చూపిన విభిన్న ప్రతిభావంతులను, దివ్యాంగ ఎన్‌జిఓ నిర్వాహకులను, దివ్యాంగ సంఘాల నేతలను సక్షమ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి మెమొంటోలు అందజేశారు. సమావేశ ప్రాంగణంలో సిఆర్‌సి, రెడ్ క్రాస్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథులు, వక్తలు మాట్లాడుతూ సక్షమ్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. అన్ని రంగాల్లో దివ్యాంగులు ముందుండాలని ప్రోత్సహిస్తున్న సక్షమ్ నిర్వాహకులను అతిథులు అభినందించారు. దివ్యాంగులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ పలు రకాలు సేవలు నిర్వహిస్తున్న సక్షమ్ సిబ్బంది పనితీరును కొనియాడారు. వివిధ ప్రతిభావంతులకు ఏ అవసరం వచ్చినా తాము ముందుండి సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రోత్సహిస్తామని తెలియజేశారు. అనంతరం దివ్యాంగ సోదర సోదరీమణులతో ఆప్యాయంగా మాట్లాడి వారి అభిప్రాయాలను వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తదనంతరం సామూహిక విందు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో సక్షమ్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ రఘురామయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ సురేష్ బాబు, జిల్లా ఉపాధ్యక్షులు సురేష్ (అతిధి), డాక్టర్ మాధవ రెడ్డి, ఏపి బిజెపి కార్యదర్శి రాజేశ్వరి, కార్యదర్శి రంగయ్య, ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ సేవ ప్రముఖ్ బి.మల్లికార్జున్ రెడ్డి, ముఖ్య అతిథులు సిఆర్‌సి డైరెక్టర్ మనోజ్ కుమార్, జి జి హెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె మాధవి, విక్రమ సింహపురి యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి ఎస్ ఎస్ భగవాన్, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి, ముఖ్య వక్త, జాతీయ ప్రధాన కార్యదర్శి ఉమేష్ అందారే, సక్షమ్ ప్రాంత సంఘటనా కార్యదర్శి కృష్ణమోహన్, ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ సంఘ్ చాలక్ రామదండు, ప్రాంత సహ సేవ ప్రముఖ్ మనోహర్‌తో పాటు జిల్లా నలుమూలల నుండి అధిక సంఖ్యలో దివ్యాంగ సోదర సోదరీమణులు, రెడ్‌క్రాస్, సిఆర్‌సి నిర్వాహకులు, సక్షమ్ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

# "కూటమి పాలనంతా అక్రమాల మయం" : కాకాణి






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు సెంట్రల్ జైలులో అక్రమ కేసులో నిందితులుగా చేర్చబడి రిమైండ్ ఖైదీలుగా ఉన్న మాజీ శాసనసభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆయన సోదరుడు పిన్నెలి వెంకట రామిరెడ్డిని కలిసిన మాజీ మంత్రివర్యులు మరియు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి. తెలుగుదేశం పార్టీ అక్రమ కేసులో నిందితులుగా చేర్చబడి సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకటరామిరెడ్డి చాలా ధైర్యంగా ఉన్నారు. చంద్రబాబు, పాలనతో పాటు, పార్టీపై పట్టు కోల్పోవడంతో డైవర్షన్ పాలిటిక్స్‌కు పూనుకుంటున్నాడు. చంద్రబాబు 5 సార్లు శాసనసభ్యునిగా గెలిచిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై కక్ష కట్టి, గతంలో 54 రోజులు జైల్లో పెట్టాడు. జైలు నుండి బయటకు వచ్చిన తర్వాత పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని టిడిపి గ్రూపు తగాదాల వల్ల జరిగిన హత్య కేసులో ఇరికించి, చంద్రబాబు మరలా తిరిగి జైలుకు పంపే ఆలోచన చేయడం అన్యాయం. చంద్రబాబు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను జైలుకు పంపడం కోసం ఎక్కడికక్కడ లాయర్లను నియమించుకొని కోట్లాది రూపాయలు ప్రజా ధనాన్ని వృధా చేస్తున్నాడు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డిసోదరులు సుప్రీంకోర్టు ఆదేశాలను గౌరవించి, కోర్టులో లొంగిపోవడంతో, కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. తెలుగుదేశం నాయకులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో పాటు, కూటమి పార్టీలో భాగస్వాములైన బిజెపి, జనసేన పార్టీ నాయకులపై కూడా దాడులు చేస్తున్నారు. మాచర్ల నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నాయకులే సొంత పార్టీ నాయకులను చంపడంతో, చంద్రబాబుకు దిక్కుతోచక పరువు పోతుందని జంట హత్యాల కేసులో పిన్నెల్లిపై కక్ష సాధింపులో భాగంగా, ఇరికించి జైలుకు పంపాడు. వెల్దుర్తి మండలం, గుండ్లపాళెం గ్రామంలో జరిగిన హత్యలో చనిపోయినవారు, చంపినవారు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అనుచరులు. జూలకంటి బ్రహ్మానందరెడ్డి చేత ప్రారంభించిన స్కార్పియో వాహనాన్ని ముద్దాయిలు హత్య చేయడానికి ఉపయోగించారు. తెలుగుదేశం పార్టీ నాయకుల గ్రూపు తగాదాల వల్లే హత్య జరిగిందని అప్పటి ఎస్పీ మీడియాకు స్పష్టత ఇవ్వడంతో చంద్రబాబు ఎస్పీని బదిలీ చేయించాడు. చంద్రబాబు తనకు అనుకూలంగా మాట్లాడని అధికారులను బదిలీ చేయించి, తన అనుకూల అధికారులను నియమించుకోవడం అలవాటు. కూటమి ప్రభుత్వంలో చేయని తప్పుకు శిక్ష పడి, జైలుకు వెళుతుండటం దారుణం. చంద్రబాబు, పిన్నెల్లి సోదరులను జైలులో పెట్టి, ఇబ్బందులకు గురి చేసి హింసించాలనే ప్రయత్నం చేస్తున్నాడు. వ్యక్తిగత కక్షలతో జరిగిన హత్య కేసులో పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని, ఆయన సోదరుడి పేరును చేర్చి దుర్మార్గంగా నేడు జైలుకు పంపించారు. చంద్రబాబు ప్రభుత్వం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను చూసి భయపడుతున్నాడు. చంద్రబాబు, పిన్నెల్లి సోదరులకు మద్దతుగా నిలిచే వారిని అడ్డుకునేందుకు పోలీసులను ఉపయోగిస్తున్నాడు. పోలీసులు ప్రజల శాంతిభద్రతలు మరిచి, తెలుగుదేశం నాయకుల సేవలో తరిస్తున్నారు. ప్రశాంతమైన నెల్లూరు జిల్లాలో గంజాయి, డ్రగ్స్ విపరీతంగా పెరిగిపోయి రోజుకో హత్య జరుగుతున్నా, పోలీసులు ప్రజా భద్రతను పట్టించుకోకుండా, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై అన్యాయంగా కేసులు పెడుతున్నారు. జగన్మోహన్ రెడ్డి సారధ్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కూటమి ప్రభుత్వపు దౌర్జన్యాలను మానసికంగా, ధైర్యంగా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నారు. చంద్రబాబు తనకు ఇవే చివరి ఎన్నికలుగా భావించి, తనకు నచ్చని వారిపై కక్ష సాధింపులకు పాల్పడుతున్నాడు. లోకేష్‌కు పరిపాలన చేతకాక, జాతీయ స్థాయిలో భ్రష్టు పట్టాడు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా, జగన్మోహన్ రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి కావడం ఖాయం. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మితిమీరి ప్రవర్తిస్తున్న ప్రతి ఒక్క అధికారిపై విచారణ జరిపించి, చర్యలు తీసుకుంటాం. కూటమి ప్రభుత్వపు అబద్ధపు కేసులపై న్యాయపోరాటం చేస్తాం. అన్యాయానికి గురైన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అండగా నిలుస్తాం. చంద్రబాబు ఎన్ని కేసులు పెట్టినా, వేధించినా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వెన్ను చూపించి, పారిపోయే పరిస్థితి ఉండదు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరులకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది.



## నెల్లూరులో టిడిపి కండువా కప్పుకున్న ఇద్దరు వైసీపీ కార్పొరేటర్లు

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు 37వ డివిజన్ కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్ యాదవ్, 42వ డివిజన్ కార్పొరేటర్ కరిముల్లా మంత్రి నారాయణ సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్నారు.

## స్థానిక ఎన్నికలకు సిద్ధం కండి

**గజపతినగరం, (రాజధాని వార్తలు):** త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు బిజెపి శ్రేణులు సిద్ధంగా ఉండాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోటగిరి నారాయణరావు, గుడివాడ నాగరాజు పిలుపునిచ్చారు. మండల అధ్యక్షులు మేటికోటి భాస్కరరావు అధ్యక్షతన బిజెపి మండల పార్టీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రధానంగా రాబోయే స్థానిక ఎన్నికల పైన సమీక్ష నిర్వహించారు. ఇప్పటినుంచి గ్రామాల్లో విస్తృతంగా నాయకులు ప్రచారం చేపట్టాలన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలి అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ జిల్లా అధ్యక్షులు దొగ్గ దేవుడు బాబు, జిల్లా ఉపాధ్యక్షులు ఆరిశెట్టి ఏడుకొండలు, రామారావు, కాగుపాటి తవుడు, పాపినాయుడు, తవిటినాయుడు, కృష్ణ, గౌరీ, గోపి, జమ్ము రమేష్,



కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ప్రశాంతమ్మ చొరవతో ఆలూరుపాడు కుమ్మరుగంటలో తాగునీటి కష్టాలు తీరాయి



**- తాగునీటి సమస్య పరిష్కారం కావడంతో ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన కుమ్మరగుంట వాసులు**

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** కొడవలూరు మండలం ఆలూరుపాడు గ్రామంలోని కుమ్మరుగంటలో తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న స్థానికులకు ఊరట లభించింది. గత కొన్ని రోజులుగా కుమ్మరుగంట ప్రాంతంలో తాగునీటి సరఫరాకు వినియోగించే మోటారు చెడిపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్య పై గ్రామస్థులు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని సంప్రదించగా ఆమె తక్షణమే స్పందించారు. కేవలం 24 గంటలలోపు చెడిపోయిన మోటారు స్థానంలో కొత్త మోటారును బిగించి, నీటి సరఫరాను పునరుద్ధరించడం జరిగింది. ప్రశాంతమ్మ ఆదేశాల మేరకు అధికారులు వెంటనే రంగంలోకి దిగారు. 24 గంటల్లోనే నీటి సమస్య పరిష్కారం చేయడంతో స్థానిక నాయకులు మరియు కుమ్మరుగంట ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# అన్ని శాఖలు సమన్వయంతో శంబర జాతరను విజయవంతం చేయాలి : మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

**మక్కువ, (రాజధాని వార్తలు):** మక్కువ మండలం శంబర గ్రామంలో ఉత్తరాంధ్ర ఇలవేల్పు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ శ్రీ శంబర పోలమాంబ అమ్మవారి జాతర సందర్భంగా సామాన్య భక్తులకు ఇబ్బందులు కలగకుండా జాతర ఏర్పాట్లను పూర్తి చేయాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ మరియు గిరిజన శాఖామాత్యులు గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. వచ్చే ఏడాది జనవరి నెలలో ప్రారంభం కానున్న శంబర జాతర ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి, సబ్ కలెక్టర్ ఆర్.వైశాలితో కలిసి దేవాదాయ శాఖ అదికారులు, దేవాలయ కమిటీ, ఇతర శాఖల అధికారులతో మంత్రి శనివారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శంబర పోలమాంబ అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించేందుకు అధికారులకు పలు సూచనలు జారీ చేసారు. గ్రామ పెద్దలు, అధికారులు సమన్వయంతో నెల రోజుల ముందుగా అవసరమైన ఏర్పాట్లను చేపట్టాలని అన్నారు. తాగునీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు ఉండరాదని, కొళాయిలు, బోర్లు పూర్తి స్థాయిలో పని చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా మరుగుదొడ్లు సిద్దం చేయాలని, పారిశుధ్యం నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. అమ్మవారి మారు జాతర ముగిసే వరకు పారిశుధ్యంపై ప్రణాళిక వేసుకోవాలని తెలిపారు. పార్కింగ్ స్థలాలు, ప్రవేశం, బయటకు వెళ్లే మార్గాలు పక్కాగా ఉండాలని, అత్యవసర సమయంలో అంబులెన్సులు వెళ్ళుటకు రహదారి అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. వైద్య ఆరోగ్య శాఖ శిబిరాలు ఏర్పాటు చేయాలని, అత్యవసర పరిస్థితులలో అవసరమగు అన్ని మందులు శిబిరాల్లో అందుబాటులో ఉండాలని, ఫీడర్ అంబులెన్సు సిద్దంగా ఉంచుకోవాలన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండాలని, అవసరమగు విద్యుత్ సరఫరాకు అదనపు ట్రాన్స్ ఫార్మర్ లు ఏర్పాటు చేయాలన్నారు. అగ్నిమాపక యంత్రాలను ఏర్పాటు చేయాలని, ప్రజలకు సమాచారం ఇచ్చుటకు, సమాచారం స్వీకరించుట మైక్‌ల ద్వారా ప్రకటించుటకు పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాటు చేయాలన్నారు. కంట్రోల్ ఏర్పాటు చేసి అచ్చట నుండి సమాచారం అందించాలని సూచించారు.



మైక్ ద్వారా ఇచ్చే సమాచారం జాతర జరిగే మొత్తం ప్రాంతంలో వినిపించాలని, రవాణాకు ఎటువంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని రహదారులు భవనాలు శాఖను సూచించారు. వచ్చే భక్తులకు రవాణా సౌకర్యం ఇబ్బందులు ఉండకుండా తగిన బస్సులు ప్రజా రవాణా శాఖ ఏర్పాటు చేయాలన్నారు. దేవదాయ శాఖ అవసరమగు సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని అన్నారు. 2026 జనవరి 26 నుండి 28 వరకు జరగనున్న ఈ ఉత్సవాలను దిగ్విజయంగా నిర్వహించేందుకు సంబంధించిన ఏర్పాట్లు, కార్యాచరణ ప్రణాళికలపై ప్రధానంగా చర్చించారు. పండగకు నెల రోజుల ముందే ఈ సమావేశం నిర్వహించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. గతంలో చర్చించిన అంశాలపై వివిధ శాఖల అధికారులు తమ యాక్షన్ ప్లాన్‌తో సిద్ధంగా వచ్చి, పండగకు ఒక వారం ముందు మరో సమీక్షా సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. జాతర ఏర్పాట్లపై మరోసారి సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం పోలమాంబ అమ్మవారిని కలెక్టర్, సబ్ కలెక్టర్‌తో కలిసి మంత్రి దర్శించుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టరు మాట్లాడుతూ జాతర ప్రశాంతంగా సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. జాతరకు వచ్చే ప్రతి భక్తుడు, భక్తురాలు పూర్తి సంతృప్తితో తిరిగి వెళ్లాలని అందుకు అందరూ సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. రాష్ట్రం నుండి మాత్రమే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున లక్షలాదిగా భక్తులు తరలి వస్తారని అందుకు తగిన ఏర్పాట్లు ఉండాలని స్పష్టం చేశారు. గత అనుభవాల దృష్ట్యా లోపాలను సవరించుకుంటూ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పోలీస్ బందోబస్తు తగినంత ఏర్పాటు చేసి, ఎటువంటి సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అలాగే బస్సు స్టేషన్లలో పారిశుద్యంపై దృష్టి సారించి త్రాగునీరు, సౌకర్యాలు కల్పించాలన్నారు. అలాగే ప్రతీ బస్సులో అమ్మవారి ఫోటో ఏర్పాటు చేసి మైక్ కూడా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్లాస్టిక్ వినియోగం నియంత్రించాలన్నారు. సాలూరు నుండి మక్కువకు బస్సు సౌకర్యం లేకపోవడంపై మంత్రివర్యులు ఆర్టిసి అధికారులను ప్రశ్నించగా రోడ్డు సౌకర్యం లేక బస్సు నడపలేకపోతున్నామన్నారు. రోడ్డు నిర్వహణకు సంబందించి ఆర్ అండ్ బి జెఈ రానున్న 2 వారాల్లో రోడ్డు సౌకర్యం కల్పిస్తామన్నారు. బస్సు సౌకర్యం కల్పిస్తామని ఆర్టిసి అధికారులు వివరించారు. గత సంవత్సరం పండగ ముందుగా రోడ్లు వేయించడం ద్వారా భక్తులు అసౌకర్యం లేకుండా జరిగిందన్నారు. ఈ సంవత్సరం మరింత మంచిగా నిర్వహించాలన్నారు. స్త్రీశక్తి ఉచిత బస్సు ఉన్నందున అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. 800 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు నిర్వహించడం జరుగుతుందని సిఐ రామకృష్ణ వివరించారు. 145 పారిశుధ్య కార్మికులు ఏర్పాటు చేసి నిరంతరం పారిశుధ్యం అదజేయడం జరుగుతుందని జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు వివరించారు. జిల్లా కలెక్టర్ 250 మంది పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేయాలని వారికీ వసతి సౌకర్యం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎపిఇపిడిసిఎల్ డిఇఇ విద్యుత్ ఏర్పాట్ల పై మాట్లాడుతూ 40 మంది సిబ్బందితో షిష్ట వారిగా విధులు నిర్వహించడం జరుగుతుందని, అలాగే ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందని, 3 పోల్లు మార్చవలసి ఉంది మార్చడం జరుగుతుందన్నారు. సిరిమాను తిరిగిన సమయంలో సప్లై ఆఫ్ చేయడం జరుగుతందని, జనరేటర్ ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందన్నారు. ఆర్డబ్ల్యూఎస్ ఇఇ మాట్లాడుతూ త్రాగు నీరు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ట్యాంకర్లతో త్రాగు నీరు అందజేయడం జరుగుతుందని అన్నారు. అలాగే గ్రామంలో వివిధ ప్రదేశాల్లో 50 మరుగుదొడ్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మంత్రివర్యులు మాట్లాడుతూ అదనంగా మరుగుదొడ్ల ఏర్పాటుకు కావలసిన చర్యలు చేపట్టాలన్నారు. ఎక్సైజ్ శాఖ అధికారి మాట్లాడుతూ పండగ మూడు రోజులు 24 గంటలు టెంపరరీ చెక్ పోస్టు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అలాగే రెండు మొబైల్ టీమ్‌లో కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మంగళవారం మధ్యాహ్నం సినిమాను ప్రదర్శన అయినంతవరకు గ్రామంలో నిర్ణయం తీసుకొని మద్యం విక్రయాలు ఆపవలసినదిగా మంత్రి ఆదేశించారు. మక్కువ తహసీల్దార్, ఎంపిడిఓ పండగ సమయంలో చేపట్టనున్న పనులు వివరించారు. పండగ రోజుల్లో దుకాణాల మంజూరుకు టెండర్లు పిలవాలన్నారు. గ్రామంలో చెత్త బుట్టలు ఏర్పాటు చేయాలన్నారు. సొంత నిర్ణయాలు తీసుకోకుండా సబ్ కలెక్టర్ వారి దృష్టిలో వుంచి అనుమతి తీసుకోవాలన్నారు. శ్రీ పోలమంబ అమ్మవారి జాతర మహోత్సవంలో దేవాదాయ శాఖ చేపట్టనున్న పనులు వివరించారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారి మాట్లాడుతూ 8 మెడికల్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందని అందుకు కావలసిన మందులు సిబ్బంది అందుబాటులో ఉంచడంతో పాటు 108, 104, ఫ్రీడమ్ అంబులెన్సులు అందుబాటులో ఉంచుకోవడం జరుగుతుందని వివరించారు. మంత్రివర్యులు మాట్లాడుతూ సుమారు 10 వారాలు పండగ జరుగుతుంది కావున మెడికల్ క్యాంపులు మరిన్ని రోజులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎ.ఎస్.పి మనీషా రెడ్డి జిల్లా దేవాదాయ శాఖ అధికారి రాజారావు, జిల్లా పంంచాయతీ అధికారి కొండలరావు, జిల్లా విపత్తుల నివారణ అధికారి పి.సింహాచలం, జిల్లా రవాణాశాఖ అధికారి టి.దుర్గాప్రసాద్ రెడ్డి, జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్, ఆర్ అండ్ బి, ఆర్డబ్ల్యూఎస్, విద్యుత్, వైద్య ఆరోగ్య, సంబంధిత శాఖ అధికారులు, మక్కువ ఎంపిడిఓ ఎన్. అర్జున్ రావు, తహసీల్దార్ కె. భరత్ కుమార్, ట్రెస్ట్ బోర్డు చైర్మన్ నైదాన తిరుపతి రావు, ఎంపిటిసి పిల్ల పోలినాయుడు, సర్పంచ్ ఎ.సింహాచలం, ఉప సర్పంచ్ అల్లు వెంకటరమణ, వసంతల భాస్కరరావు, గంజి కాసి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# సత్య డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ ఎస్ ఎస్ ప్రత్యేక శిబిరం

## 3వ రోజున కంటి వైద్య శిబిరం నిర్వహణ






**విజయనగరం, (రాజధాని వార్తలు):** తోటపాలెం గ్రామంలో జరుగుతున్న సత్య డిగ్రీ కళాశాల ఎన్ ఎస్ ఎస్ ప్రత్యేక శిబిరం మూడవ రోజు కార్యక్రమాలలో భాగంగా గ్రామ ప్రజల ఆరోగ్య సంరక్షణ లక్ష్యంగా కంటి వైద్య శిబిరం ను మ్యాక్స్ విజన్ కంటి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ శిబిరంలో అనుభవజ్ఞులైన కంటి వైద్యులు గ్రామస్తులకు కంటి పరీక్షలు నిర్వహించి, కంటి సమస్యలపై అవగాహన కల్పించారు.

అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేయ డంతో పాటు, కళ్లద్దాలు అవసరమైన వారిని గుర్తించి తదుపరి చికిత్సకు మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, "గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడం ఎన్ఎస్ఎస్ యొక్క ముఖ్య లక్ష్యం. విద్యార్థుల్లో సేవాభావాన్ని పెంపొందించడమే ఈ శిబిరాల ఉద్దేశ్యం" అని తెలిపారు.


ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి సూరప నాయుడు, ఎన్‌సిసి ఆఫీసర్లు కెప్టెన్ ఎం సత్యవేణి, లెఫ్టినెంట్ ఎం ఉదయ్ కిరణ్, అధ్యాపకులు మరియు వాలంటీర్లు శిబిర నిర్వహణలో చురుకుగా పాల్గొన్నారు. గ్రామ పెద్దలు ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ కళాశాల యాజమాన్యానికి మరియు ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లకు కృతజ్ఞతలు తెలిపారు. మరియు అవయవ దానముపై అవగాహన ర్యాలీని నిర్వహించటం జరిగింది.

# విజయవంతంగా కొనసాగిన వాలీబాల్ టోర్నమెంట్









**కాకినాడ, (రాజధాని వార్తలు):** జెఎన్టియుకె క్రీడా ప్రాంగణంలో ఈనెల 10వ తేదీ నుండి 14వ తేదీ వరకు అసోసియేషన్ ఆఫ్ ఇండి యన్ యూనివర్శిటీస్ (ఏఐయు) సహకారంతో జెఎన్టియుకె, ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల, సురంపాలెం మరియు రాజీవ్ గాంధీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ సైన్సెస్, కాకినాడ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్శిటీ వాలీబాల్ టోర్నమెంట్ ది.13.12.2025 శనివారం విజయవం తంగా కొనసాగింది.

శనివారం జరిగిన పోటీలలో చెన్నైలోని తమిళనాడు ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ యూనివర్సిటీపై మం గళగంగోత్రిలోని మంగళూరు యూనివర్సిటీ 3-0 తేడాతోను, చెన్నైలోని అన్నా యూనివర్సిటీ పై కొట్టాయంలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీ 3-1 తేడాతోను, కేరళలోని కేరళ యూనివ ర్సిటీపై తమిళనాడులోని భారతియార్ యూనివర్సిటీ 3-2 తేడాతోను, మంగళగంగోత్రి లోని మంగళూరు యూనివర్సిటీపై చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ 3-0 తేడాతోను, కొట్టాయం లోని మహాత్మా గాంధీ యూనివర్సిటీపై కేరళలోని కాలికట్ యూనివర్సిటీ 3-0 తేడాతో గెలుపొందినట్లు టోర్నమెంట్ కన్వీనర్ డా.జి.శ్యామ్కుమార్ మరియు టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డా.జి.పి.రాజు తెలిపారు.

# ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన




**విజయనగరం, (రాజధాని వార్తలు):** ఎముకలు బలంగా ఉండాలంటే శరీరాన్ని చురుగ్గా ఉంచుకోవాలని ప్రముఖ వైద్యులు, ఎముకల కీళ్ల వ్యాధుల నిపుణులు డాక్టర్ జివిఎన్ భూపతి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రంధాలయ సంఘం విజయనగరం జిల్లా శాఖ అధ్యక్షులు సముద్రాల గురు ప్రసాద్ ఆధ్వర్యంలో కాళీ ఘాట్ కాలనీలో సన్ షైన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని మాట్లాడుతూ వాకింగ్, జాగింగ్, స్విమ్మింగ్, రన్నింగ్, మెట్లు ఎక్కడంలాంటివి ఎముకలు బలంగా ఉండేందుకు దోహదపడతాయని ఈ వ్యాయామాలు ఎముకల కణాల పెరుగుదలకు సహాయపడతాయని అన్నారు. ఉచిత వైద్య శిబిరాన్ని 42వ డివిజన్ కార్పొరేటర్ మరియు ఆంధ్రప్రదేశ్ గ్రంధాలయ సంఘం మరియు ఆంధ్రప్రదేశ్ గ్రంధాలయ సంఘం జిల్లా శాఖ ఉపాధ్యక్షురాలు పిన్నింటి కళావతి, సూర్యనారాయణ దంపతులు ప్రారంభించారు. శ్రీ హాస్పిటల్ అధినేత డాక్టర్ భూపతి నేతృత్వంలో జరిగిన వైద్య శిబిరంలో ఉచితంగా పరీక్షలు నిర్వహించడమే కాక ఉచితంగా మందులు కూడా పంపిణీ చేశారు .2000 రూపాయల విలువైన ఎముకల సాంద్రత పరీక్షలను కూడా ఉచితంగా చేశారు. ఈ వైద్య శిబిరాన్ని సుమారు 300 మంది వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్లు టి.సంధ్య, టి.జ్యోతి, పీ. నీలిమ, ఆసుపత్రి సిబ్బంది చామర్తి సాయి కిషోర్ ,జమ్ము రాము, ఎం పద్మ, జి బలరామరాజు, వివిధ కంపెనీలకు చెందిన మెడికల్ రిప్రజెంటేటివ్‌లు నూకల సుధీర్, రఘుమండ రామకృష్ణ, డి.భాస్కర్ రావు, కే రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఐసిడిఎస్ హైర్ వెహికల్స్ డ్రైవర్ల న్యాయమైన పోరాటాలకి ఏఐటీయూసీ మద్దతు

### - ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్





**విజయనగరం, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ ఐసిడిఎస్ హైర్ వెహికల్స్ ఓనర్స్ అండ్ డ్రైవర్ అసోసియేషన్ ద్వితీయ వార్షికోత్సవ సందర్భంగా శనివారం ఉదయం విజయనగరం డిఆర్డిఏ మీటింగ్ హాలులో రాష్ట్ర సహాయ కార్యదర్శి గదుల సత్యన్నారాయణ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ హాజరయ్యారు. ఈ సమావేశంలో ముందుగా ఆంధ్రప్రదేశ్ ఐసిడిఎస్ హైర్ వెహికల్స్ ఓనర్స్ అండ్ డ్రైవర్ అసోసియేషన్ రాష్ట్ర క్యాలెండర్‌ను ఆవిష్కరించడం జరిగింది. అనంతరం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఐసిడిఎస్ హైర్ వెహికల్స్ ఓనర్స్ అండ్ డ్రైవర్ అసోసియేషన్ ద్వితీయ వార్షికోత్సవ సందర్భంగా ఐసిడిఎస్ హైర్ వెహికల్స్ డ్రైవర్ మిత్రులందరికీ ఏఐటీయూసీ జిల్లా సమితి తరపున శుభాకాంక్షలు తెలియచేసారు. రాష్ట్ర వ్యాపితంగా ప్రస్తుతం కేవలం 35 వేల రూపాయిలు అతి తక్కువ బడ్జెట్ కేటాయిస్తున్న కానీ ఐసిడిఎస్ పరిధిలో అధికారుల కోసం ప్రభుత్వ కార్యకలాపాల్లో ఎనలేని సేవలందిస్తున్న డ్రైవర్ల కష్టాలను కనీసం పట్టించుకోవడం లేదన్నారు. డ్రైవర్ల చేత వెట్టి చాకిరీ చేయించుకోవడం తెలిసిన ప్రభుత్వ అధికారులకి డ్రైవర్ల బాధలు పట్టవా అని బుగత అశోక్ మండిపడ్డారు. సిడిపిఓ అధికారుల్లో కొంతమంది సొంత కార్లు ఉపయోగించి బిల్లులు డ్రా చేసుకుంటూ డ్రైవర్ల జీవనోపాధి మీద దెబ్బ కొట్టడం దుర్మార్గమన్నారు. డ్రైవర్లపై జరుగుతున్న వెట్టి చాకిరీ విధానాలపై రాష్ట్ర వ్యాపితంగా అన్ని రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న హైర్ వెహికల్ డ్రైవర్లు అందరూ సంఘటితమైతేనే గాని సమస్యలు పరిష్కారం చేసుకోగలమని అన్నారు. అందుకోసం రాష్ట్ర యూనియన్ పెట్టి రిజిస్ట్రేషన్ చేయడం జరిగింది కాబట్టి ప్రతి ఒక్కరూ యూనియన్‌లో చేరి న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాటలకు సన్నద్ధం కావాలని బుగత అశోక్ పిలుపునిచ్చారు.

డ్రైవర్ల న్యాయమైన పోరాటాలకు ఏఐటీయూసీ ఎల్లప్పుడూ అండగా నిలబడుతుందని హామీ ఇచ్చారు. ఈ సమా వేశంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మాదిరెడ్డి నరేంద్ర కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు స్వర్ణ సురేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్సులు పాల రామచంద్రరావు, అడిగర్ల అరుణ్ కుమార్, రాష్ట్ర సహాయ కార్యదర్సులు గదుల సత్యనారాయణ, ఇళ్ళ అశోక్ బాబు, రాష్ట్ర కోశాధికారులు చప్పిడి బాలస్వామి, కె. రెహమాన్, రాష్ట్ర కమిటీ మెంబర్లు బి. హరిబాబు, వజ్రాల కుమార్, కొమ్మిది గంగాధర్, బయ్యవరపు హరిబాబు లు ప్రసంగించారు మరియు యూనియన్ సభ్యులు పాల్గొనడం జరిగింది.

# సంపాదకీయం

## నన్ను నేను ఒప్పించుకునే ప్రయత్నం నా కవిత్వం

మనుష్యులు తమతమ రోజువారీ యుద్ధాలను దాటడానికి పోరాటం ఎంత ముఖ్యమో పోనివ్వాలనే చూపూ అంతే ముఖ్య మని తెలిసిన కవి బివివి ప్రసాద్. అందుకే గెలుపు జ్వరం పట్టిన లోకంలో, ఓడిపోవడానికే ఎక్కువ ధైర్యం కావాలని ఇప్పటికి ఎన్నో యేళ్ళ క్రితమే తన కవిత్వంలో చెప్పగలిగారు. లోపలి ప్రపంచంతో నిజాయితీగా సాగే సంభాషణల్లో, కొంత ఆనందమూ, కొంత దిగులూ, కొంత ఆశా కొంత వెలితీ అన్నీ తెరలు తెరలుగా తనలోనే వచ్చిపోవడం మనిషికి తెలుస్తుంది. ఆ ఉద్వేగాల ఉధృతిని అర్థం చేసుకునేందుకు ఉపకరించే తాత్విక అన్వేషణతోకూడిన కవిత్వం బివివి గారిది. లోపలి మనిషిపట్లా, లోకంపట్లా, దయాపూరితమైన చూపును, ఆలోచనను, మెలకువను ఈ కవిత్వంలో నేను చూశాను. సీతాకోక రెక్కల్లోని ఆశను, వర్షపు చినుకుల సంగీతాన్ని, వెన్నెలరాత్రుల నిశ్శబ్దంలోని గాఢమైన శాంతిని ఈ పదాల్లో నుండీ అందుకున్నాను. బివివి ప్రసాద్ కొత్త కవిత్వ సంపుటి 'సృష్టి' విడుదలైన సందర్భంగా ఆయనతో ఇంటర్వ్యూ. 'ఆకాశం' సంపుటితో మొదలై మీ కవిత్వ సంపుటుల్లో మీదైన శైలి ప్రస్ఫుటంగా కనపడుతూ వస్తోంది. దీని వెనుక ఉన్న సాధన, ప్రభావాలను చెప్పండి. 'ఆకాశం' రాసేనాటికి, శిల్పపరమైన ఎలాంటి కండిషన్ లేకుండా, నన్ను నేను వాక్యాల్లోకి తెరుచుకోవటం కొంత చాతనైంది అనుకుంటాను. అయితే నా వాక్యం నేను కనుగొనడానికి సహాయపడినవారు ముఖ్యంగా టాగోర్, ఖలీల్ జిబ్రాన్. పరమ ఉదాత్తమైనదాన్నే కవితా సమయంలో తాకాలని నేర్పారు వారు. తర్వాత ఇస్మాయిల్. కవిత్వంలోకి అనుభవాన్ని అనువదించడం, ప్రధానంగా, ఆయన నుండి వచ్చిందనుకుంటాను. మొదటి సంపుటి 'ఆరాధన'లోని కవితలలో ఏకరూప్యత లేకపోవటం గమనిస్తే, నాదైన వాక్యం కోసం తపన పడటం తెలుస్తుంది. 'నేనే ఈ క్షణం' సంపుటిలోని కవితల కాలంలోనే, విస్తృతంగా సాధన చేసిన హైకూ ప్రక్రియ brevity, effect, easeలను నేర్పింది. గనుక జపనీయ కవుల ప్రభావం కూడా నా వాక్యాల్లో ఉండవచ్చును. శ్రీ రమణమహర్షి బోధించిన ప్రశ్న 'నేనెవరు' నా తాత్విక అన్వేషణకి మూలం. ఆ 'నేను'ను గురించి విస్తృతంగా, లోతుగా వివరించిన నిసర్గదత్త మహరాజ్‌ని చదవటం స్పష్టత నిచ్చింది. 'నేను'ను మరింత సూక్ష్మంగా బోధించిన వారు శ్రీకాళహస్తిలోని సుబ్రహ్మణ్యంగారు. పూర్వ ఋషుల బోధలు, ఎకార్ట్ టోలీ వంటి ఆధునిక ద్రష్టల సూచనలు కూడా నా వెదుకులాటకి సహాయపడుతున్నాయి అనుకుంటాను. అయితే, అంతిమంగా ఎవరైనా తమదైన స్పష్టత, వెలుగు తామే పొందాల్సి ఉందని పిస్తుంది. రూమి, టాగోర్ లాంటి తాత్వికకవుల్లో దైవం కోసం, దైవానుగ్రహం కోసం, సన్నిధి కోసం వెదుకులాట ఉంటుంది. మీ అన్వేషణకు దైవం కేంద్రం కాదు. ఎందుకు? పూర్వ తాత్వికకవులు సత్యాన్ని దైవంగా, చూడబడేదిగా తలచటం ఎక్కువ, కొన్ని మినహాయింపులున్నా. నా ప్రయత్నమంతా నన్ను నేను తెలుసుకోవటం వైపే, నేను నేనుగా ఉండటం వైపే ఉంటుంది. రమణమహర్షి తనలో తాను సంస్థితం కావటం అంటారు. తెలియటం కూడా కాదు, అదిగా ఉండటం. అది సర్వ దర్శనాల లక్ష్యంగా తోచింది. ఒక ఆబ్జెక్ట్‌ని కవిత్వం చేయటంలో వెసులుబాటు ఉంటుంది. 'నేను'కీ ఆ వస్తువుకీ మధ్యనున్న ఖాళీలో ఎన్ని ఊహలైనా, నాటకీయత అయినా, ఎంత రసమైనా చొప్పించవచ్చును. కానీ 'నేను'ను కవిత్వం చేయటం దుస్సాధ్యం. కానీ, ప్రసాద్ అనే నేను, ఏమీకాని నేనుగా ఉండాలనుకున్నపుడు ఆ ప్రయత్నం, వెదుకులాట, దుఃఖం, ఆనందం కవిత్వంగా మారే వీలు కలుగుతుంది. ఆ చలనాలు కేవలం బౌద్ధికం కాకుండా, హృదయగతమైనప్పుడు అది కవిత్వంగా పండుతుంది. మీ కవితల్లో అధికభాగం 'నువ్వు' అని సంబోధిస్తూ రాస్తారు. దీనికేమైనా ప్రత్యేకమైన కారణం ఉందా? నా కవిత్వం నాతో నేను జరిపే సంభాషణ. కవిగా ఉన్న తాను, ఒంటరి తనతో జరిపే సంభాషణలో కవి, ఒంటరి మనిషిని ఉద్దేశించి చెబుతుంటాడు. ఈ ధోరణి ఉద్దేశపూర్వకంగా కాకుండా, సహజంగా నాలో ఏర్పడిందనుకుంటాను. గాఢమైన అనుభవంతో నిండిన ఒక మనిషి సాంత్వనగా పలుకుతున్న మాటల్లా వినపడుతుంది మీ కవిత్వం, అదే సమయంలో వాక్యాలు బోధ చేస్తున్నట్లు కూడా ఉండవు. ఇది ఎలా నిర్వహిస్తారు. నా కవిత్వం, ముఖ్యంగా 'ఆకాశం'తో మొదలు పెట్టి, నన్ను నేను కన్విన్స్ చేసుకునే ప్రయత్నం, జీవితాన్నీ, మనుషుల్నీ, నన్నూ ప్రేమించటానికి, మరింత లోతుగా గ్రహించటానికి. చాలాసార్లు జీవించి ఉండటానికి నన్ను నేను ఒప్పించుకునే ప్రయత్నం కూడా. నాకు నేనే ఔట్‌సైడర్‌గా ఒక బోధకుడిలా, తండ్రిలా, మిత్రునిలా, కౌన్సిలర్‌లా ఉంటూ నాకు చెప్పుకోవటం. చెప్పే నేను, వినే నేను ఒకరే గనుక ఒకరు ఎక్కువా, ఒకరు తక్కువా కారు గనక, బోధ ఉన్నా అది ఆజ్ఞలా కాక, మృదువుగా, భుజం మీద చేయి వేసి మాట్లాడినట్లు వస్తుంది. ఒక కవిత మీలో ఎలా తయారై, ఎలా వ్యక్తమవుతుంది? కవిత్వం నా జీవితానుభవం నుండి, చూపు నుండి, ఆర్తి నుండి పుడుతుంది. అది ఆకాశంలో మేఘాలు పుట్టినట్టు, సాంద్రమైన భావాలుగా రూపు దిద్దుకొంటూ ఉంటుంది. మేఘం బరువెక్కినపుడు ఇక కురవబోతుంది అని మనకి తెలిసినట్లే, భావ సాంద్రత ఏదో ఒక సమయంలో ఒక ఊహ ద్వారానో, వాక్యం ద్వారానో, ఉపమ ద్వారానో పదాల్లోకి కురవబోతుంది అనిపిస్తుంది. మొదటివాక్యం పూర్తవుతూ ఉండగా, రెండవ వాక్యం తెరుచుకుంటుంది. ముగింపు వరకూ అలానే నడుస్తుంది. వాన వెలుస్తుంది. కవిత్వం రాయటం అయిదు, పదినిమిషాల పని. కానీ ఆ కవితకి తయారుకావటం వెనక జీవితమంతా ఉంటుంది అనుకుంటాను.

# చెరలో ఉన్న మత్స్యకారులపై కూటమి నిర్లక్ష్యం

**- తొమ్మిది కుటుంబాలకు అండగా నిలిచిన వాసుపల్లి - బాధిత కుటుంబాలకి రూ. 45,000 లు, రైస్ బ్యాగ్‌లు అందజేత - చెర నుండి విడుదలయ్యే వరకు అండగా ఉంటాం : వైసీపీ దక్షిణ సమన్వయ కర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్**



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** బంగ్లాదేశ్‌లో చిక్కుకుపోయిన నెల్లిమర్లకు చెందిన 9 మంది మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే రూ.5 లక్షలు నష్టపరిహారం ఇచ్చి దైర్యం, భరోసా కల్పించాలని మాజీ ఎమ్మెల్యే, దక్షిణ వైసీపీ సమన్వయ కర్త వాసుపల్లి గణేష్ కుమార్ డిమాండ్ చేశారు. ఆశీలమెట్ట కార్యాలయంలో 9 మత్స్యకార బాధిత కుటుంబాలకు వాసుపల్లి గణేష్ కుమార్ సొంత నిధులతో ఒక్కో కుటుంబానికి రూ.5000లు చొప్పున రూ.45,000లు అందించడంతో పాటు 25 కేజీల రైస్ బ్యాగ్ ను ఇచ్చి దాతృత్వం చాటుకున్నారు. సాధక బాధలు తెలిసిన తోటి మత్స్యకారుడిగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్ననన్నారు. మిత్ర దేశంలో బందీగా ఉన్నవారిని విడిపించడానికి చంద్రబాబుకి మా మత్స్యకారులంటే నిర్లక్ష్యమా? చేతకాని తనమా? అని వాసుపల్లి సూటిగా ప్రశ్నించారు. వైసీపీ హయంలో శత్రుదేశంలో బంధిగా ఉన్న 20 మంది మత్స్యకారులను పాకిస్తాన్ చెర నుండి విడిపించి ఫ్లైట్‌లో తీసుకుని వచ్చి ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షలు తక్షణ సాయం అందించిన మత్స్యకార పక్షపాతి జగన్ మోహన్ రెడ్డి అని వాసుపల్లి గుర్తుచేశారు. కనీసం నెల్లిమర్ల జనసేన ఎంఎల్‌ఏ నిస్సిగ్గుగా మాటాడటం సరికాదన్నారు. జనసేన అదినేత పవన్ కళ్యాణ్ అసలు మత్స్యకారులు ఇంత కష్టంలో ఉంటే కనీసం నోరు మెదపకపోవడం సిగ్గుచేటు అన్నారు. కూటమిలో ఉన్న భాగస్వామ్యంగా ఉన్న బీజేపీ కేంద్ర మంత్రికి చంద్రబాబు ఒక ఫోన్ చేస్తే సమస్య కదిలి ఉండేది. కనీసం వారిపై కదలిక లేకపోవడం చంద్రబాబు మత్స్యకారులపై చిన్న చూపుకి నిదర్శనం అన్నారు. 950 కిలోమీటర్లు తీర ప్రాంతం ఉన్న మనకీ ఎందుకింత దౌర్భాగ్యమన్నారు. బోర్డర్ దాటకుండా అలెర్ట్ చేసే అడ్వాన్స్ టెక్నాలజీ మనదేశంలోని మాత్రమే లేకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా మత్స్యకారులకు మౌలిక వసతులతో పాటు ఇటువంటివి పునరావృతం కాకుండా కేంద్రం వారికి అండగా నిలవాలన్నారు. జగన్మోహన్ రెడ్డి ద్వారా 9 మంది మత్స్యకార కుటుంబాలకి న్యాయం జరిగేలా వైసీపీ అండగా ఉంటుందని వాసుపల్లి స్పష్టం చేశారు. చెర నుండి విడుధలయ్యే వరకు వారికి రేషన్ కూడా అందిస్తాననని వాసుపల్లి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏరినమ్మ గుడి చైర్మన్ లండ రమణ, జిల్లా జనరల్ సెక్రటరీ గంగళ్ల రామరాజు, జిల్లా సెక్రటరీ బొడ్డు ఆనంద్, బర్రి కొండలరావు, 37 వార్డ్ ప్రెసిడెంట్ ఆకుల యెషు, జిల్లా యూత్ వైస్ ప్రెసిడెంట్ గుంటూ ఆనంద్, చోడిపిల్లి శివ, వాసుపల్లి ధనరాజు, జిల్లా వాలంటరీ విభాగం వైస్ ప్రెసిడెంట్ దూడ అప్పారావు, జిల్లా బీసీ సెల్ సెక్రటరీ దూడ తాతారావు, చేపల నూకరాజు (బుడ్డి),వేణు, కంటుముచ్చు సాగర్,చేపల ప్రసాద్, చేపల సతీష్, 30వ వార్డ్ మహిళా ప్రెసిడెంట్ సూరని రాము, దూడ అప్పలరాజు, 38 వ వార్డ్ ప్రెసిడెంట్ గురజాపు రవి, 39వ వార్డ్ ప్రెసిడెంట్ ముజీబ్ ఖాన్, స్టేట్ మేధావుల విభాగం సెక్రెటరీ ఈతలపాక విజయ్, చేపల రాజు, సారిపిల్లి అరుణ, చింతకాయల వాసు జిల్లా సౌత్ మత్స్యకారులు నాయకులు పాల్గొన్నారు.

# 'పబ్లిక్ స్పీచ్' ఎడిటర్ సుంకర రాజాకు ఘన నివాళి

**- అమ్మను కంటికి రెప్పలా చూసుకోండి - సుంకర రాజా పిల్లలకు శీను బాబు హితవు**

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన 'పబ్లిక్ స్పీచ్' పత్రిక ఎడిటర్ సుంకర రాజా పెద్దకర్మ కార్యక్రమాన్ని శనివారం రామ టాకీస్ ప్రాంతంలోని ఆయన నివాసం వద్ద నిర్వహించారు. ఈ నెల 3వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో సుంకర రాజా మృతి చెందిన విషయం విదితమే. ఈ కార్యక్రమానికి జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శీను బాబు హాజరై రాజా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సుంకర రాజా మరణించిన రోజే ఆయన కుటుంబానికి రూ. 10,000 తక్షణ ఆర్థిక సహాయం అందజేసిన శీను బాబు, నేడు పెద్దకర్మ రోజున కూడా వారికి కొండంత అండగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన రాజా కుమారులతో ప్రత్యేకంగా మాట్లాడుతూ తల్లిని కంటికి రెప్పలా చూసుకోవాలి. మీకు ఏ అవసరం వచ్చినా నాకు ఫోన్ చేయండి నేను ఎల్లప్పుడూ అండగా ఉంటాను అని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు పాత్రికేయ సోదరులు పాల్గొని సుంకర రాజా ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.



# ఏయూ తెలుగు విభాగం ఆల్ టైం రికార్డ్

**- మెగా డీఎస్సీ 2025లో 52 మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు - నూతన టీచర్లకు ఆచార్య జెర్రా అప్పారావు ఆధ్వర్యంలో ఘనంగా సత్కారం**




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఆంధ్ర విశ్వ కళాపరి షత్ తెలుగు విభాగం అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీ 2025లో ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా 52 మంది ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు దక్కించుకున్నారు. శనివారం ఏయూ పూర్వ విద్యార్థుల సమ్మేళనం సందరరేగా తాజాగా కొలువులు పొందిన 52 మందిని తెలుగు విభాగం శాఖ అధ్యక్షులు ఆచార్య జెర్రా అప్పారావు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ నరసింహా రావు పాల్గొని మాట్లాడుతూ 100 ఏళ్ల పండుగ జరుపుకుంటున్న ఆంధ్ర యూనివర్సిటీలో చదువుకున్న వారంతా ఎంతో ధన్యజీ వులు అన్నారు. యూనివర్సిటీ ప్రారంభించేటప్పుడు తొలుత ఆర్ట్స్ గ్రూపులతోనే ప్రారంభించారన్నారు. ఆ తర్వాత దశల వారీగా ఏయుని ఎంతోమంది అభివృద్ధి చేశారన్నారు. నేడు ప్రపంచంలోనే ఆంధ్ర విశ్వ కళాపరిషత్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిలిచిందన్నారు. సభకు అధ్యక్షత వహించిన తెలుగు శాఖ అధ్యక్షులు కార్యక్రమం నిర్వాహకులు ఆచార్య జెర్రా అప్పారావు మాట్లాడుతూ ఎంతో మందిని ఈ సమాజానికి అందించిన ఘనత ఏయూకే దక్కుతుందన్నారు. తన హయాంలో ఏకకాలంలో ఒకే డీఎస్సీలో 52 మంది టీచర్ ఉద్యోగాలు సాధించడం తనకు చిరస్థాయిగా మధురానుభూతిని మిగిలిస్తుందన్నారు. నూతనంగా కొలువులు పొందిన టీచర్లు అందర్నీ తాను సత్కరించడంతో పాటు భవిష్యత్ తరాలకు మార్గదర్శకత్వం చేయాలని సూచించానన్నారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని అంతకు మించిన గౌరవం లభించేది అన్నారు కాబట్టి ఉద్యోగం పొందిన ప్రతి ఒక్కరు సమాజానికి ఉపయోగపడే రీతిలో విద్యార్థులను తీర్చిదిద్దాలని అప్పారావు కోరారు. గౌరవ ఆచార్యులు పర్వతనేని సుబ్బారావు.. బహు గ్రంథకర్త లోక్ నాయక్ ఫౌండేషన్ అవార్డు గ్రహీత గౌరవాచార్యులు వెలమల సిమ్మన్న బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ సత్యనారాయణలు మాట్లాడుతూ తెలుగు విభాగానికి వెలుగులు నింపిన ఘనత ఆచార్య అప్పారావుకే దక్కుతుందన్నారు. దేశానికి ఎంతోమంది ప్రముఖులు అందించిన ఘనత ఏయు చిరస్థాయిగా నిలిచిపోతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో పద్మాలయ యూనివర్సిటీ తెలుగు విభాగం ప్రొఫెసర్ ఆచార్య మధుజ్యోతి ఏయ్ సీనియర్ ఆచార్యులు గజ్జ యోహాను బాబు అంబేద్కర్ యూనివర్సిటీ అధ్యాపకురాలు అన్నంరెడ్డి ఈశ్వరమ్మ మరో అధ్యాపకురాలు ప్రవీణ పలువురు పరిశోధక విద్యార్థులు పూర్వ విద్యార్థులు పాల్గొని సందడి చేశారు. ఏయూ పరిశోధక విద్యార్థి జాతీయ జర్నలిస్టులు సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరించారు.

# సకాలంలో పీబిసి రైతులకు సాగు నీరు : డెల్టా ప్రాజెక్ట్ చైర్మన్ సునీల్ కుమార్



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** పిఠాపురం బ్రాంచ్ కెనాల్ (పిబీసీ) ఆయకట్టుకు రబీ సాగుకు సకాలంలో నీరు అందించేందుకు ముందస్తు చర్యలు చేపట్టినట్లు గోదావరి తూర్పు డెల్టా ప్రాజెక్ట్ చైర్మన్ మురాలశెట్టి సునీల్ కుమార్ అన్నారు. సామర్లకోట లాకుల వద్ద నీటి లెవెల్స్‌ను పరిశీలించిన ఆయన, లెవెల్స్ పెంచేందుకు హుస్సేన్‌పురం బ్రిడ్జి నుంచి సామర్లకోట లాకుల వరకు ఉన్న గుర్రపు డెక్కను తక్షణమే తొలగించాలని డీసీ చైర్మన్ కొప్పిరెడ్డి వీరాస్వామిని ఆదేశించారు. అలాగే సామర్లకోట హెడ్ 0 నుంచి 4 ఆర్ వరకు, సైఫాన్ వద్ద గుర్రపుడెక్క తొలగింపు పనులను సంబంధిత కాంట్రాక్టర్ ద్వారా వెంటనే చేపట్టాలని సూచించారు. అదేవిధంగా 2 ఆర్ రెగ్యు లేటర్ వద్ద బల్లకట్టు మరమ్మతులు చేపట్టాలని సామర్లకోట నీటి సంఘం అధ్యక్షులు ముసిరెడ్డి రాంబాబును ఆదేశాలు జారీ చేశారు. నీటి నియంత్రణ, పంపిణీపై ఐడీసీ పంపింగ్ స్కీం అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని, ఆయకట్టుకు సకాలంలో సాగునీరు అందించేందుకు అవసర మైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఈ సంతోష్ కుమార్, డీసీ కొప్పిరెడ్డి వీరాస్వామి, నీటి సంఘం అధ్యక్షులు, లాక్ సూపరింటెండెంట్లు, లాస్కార్లు, రైతులు పాల్గొన్నారు.

# క్షతగాత్రునికి రూ.80 వేలు ఆర్థిక సాయం



**అమలాపురం, (రాజధాని వార్తలు):** రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి దేవాంగ సంక్షేమ సంఘం ఆర్థిక సహాయం అందజేసి అండగా నిలిచింది. అంబేద్కర్ కోనసీమ జిల్లా బండారులంక గ్రామానికి చెందిన చందన వంశీనాగప్రకాష్‌కు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయమయ్యింది. వైద్య పరీక్షల అనంతరం వంశీ తలకు శస్త్ర చికిత్స చెయ్యాలని చెప్పడంతో ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్న వంశీ కుటుంబ సభ్యులు బండారులంక దేవాంగ సంక్షేమ సంఘం ద్వారా రాష్ట్ర సంఘాన్ని అభ్యర్థించారు. స్పందించిన రాష్ట్ర సంఘం వంశీ ఆపరేషన్ ఖర్చు నిమ్మిత్తం రూ. 80,000 వేల రూపాయలు ఆర్థిక సాయాన్ని సంఘ రాష్ట్ర అధ్యక్షులు వూటుకూరి సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి కొండపల్లి పరమేశ్వరరావు, కార్యదర్శి బళ్ల వెంకటేశ్వరరావు, ఉపకోశాధికారి కామిశెట్టి సూరన్న, చేనేత విభాగం అధ్యక్షులు పిచ్చుక శ్యామ్, చింతపట్ల గంగా సత్యనారాయణ, ఇనుమర్తి లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు చిన్ని రామ సత్యనారాయణకు ఘన సన్మానం



**నాయుడుపేట, (రాజధాని వార్తలు):** ఆర్యవైశ్య మహాసభ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు చిన్ని రామ సత్యనారాయణను ఆ సంఘం తిరుపతి జిల్లా రూరల్ అధ్యక్షులు గూడూరు కిషోర్ కుమార్ శని వారం ఘనంగా సన్మానించారు. గూడూరు కిషోర్ కుమార్ ఆహ్వానం మేరకు నాయుడుపేట పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయానికి చిన్ని రామ సత్యనారాయణ తన కుటుంబ సభ్యులతో కలిసి విచ్చేశారు. ఈ సందర్భంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు చిన్ని రామ సత్యనారాయణ దంపతులకు నాయుడుపేట ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు పెసల జయరాజ గోపాల్, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి కనుమర్లపూడి సుబ్రహ్మణ్యం, తిరుపతి జిల్లా రూరల్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గూడూరు కిషోర్ కుమార్‌లు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

# స్టైలిష్ ఫోజులతో ఆకట్టుకుంటున్న నభా నటేష్!



సోషల్ మీడియా వాడకం పెరిగిపోయిన తర్వాత చాలా మంది సెలబ్రిటీలు ముఖ్యంగా వర్కౌట్స్ చేస్తూ కూడా ఆ ఫోటోలను అభిమానులతో పంచుకుంటున్నారు. ఈ క్రమంలోనే కొంతమంది జిమ్లో వర్కౌట్స్ చేయడమే కాకుండా అక్కడ స్టైలిష్‌గా ఫోటోలకు ఫోజులిచ్చి అభిమానులను అలరిస్తున్నారు. అందులో భాగంగానే ప్రముఖ హీరోయిన్గా పేరు సొంతం చేసుకున్న నభా నటేష్ కూడా జిమ్ నుండి కొన్ని ఫోటోలను పంచుకుంది. అందులో స్టైలిష్‌గా ఫోటోలకు ఫోజులిచ్చి అందరిని ఆశ్చర్యపరిచింది. ప్రస్తుతం నభా నటేష్‌కి సంబంధించిన ఫోటోలు వైరల్‌గా మారుతున్నాయి. 1995 డిసెంబర్ 11న కర్ణాటక రాష్ట్రం చిక్ మంగళూరు జిల్లా శృంగేరిలో జన్మించిన ఈమె మంగళూరులో ఇన్ఫర్మేషన్ సైన్స్‌లో అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీ పూర్తి చేసింది. చదువుకుంటుండగానే మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టిన ఈమె ఫెమినా మిస్ ఇండియా బెంగళూరు 2013లో టాప్ టెన్‌లో ఒకరిగా కనిపించింది. ఆ తర్వాత సినిమాల్లోకి అడుగు పెట్టిన ఈమె.. తొలిసారి 2015లో శివరాజ్ కుమార్‌తో కలిసి కన్నడ మూవీ వజ్రకాయలో నటించింది. ఈ చిత్రం ద్వారానే సినీ ఇండస్ట్రీకి పరిచయమైంది నభా నటేష్. ఈ సినిమా సూపర్ హిట్ విజయాన్ని అందుకోవడంతో అమ్మడికి మంచి గుర్తింపు లభించింది. 2018లో తెలుగులో తొలిసారి నన్ను దోచుకుందువటే అనే సినిమా ద్వారా ఇండస్ట్రీకి పరిచయం అయింది. అదుగో, ఇస్మార్ట్ శంకర్, డిస్కో రాజా, సోలో బ్రతుకే సో బెటర్ వంటి చిత్రాలలో నటించి ప్రేక్షకులను అలరించింది. ఇకపోతే గత కొంతకాలం క్రితం యాక్సిడెంట్ బారిన పడ్డ ఈమె దాని నుండి రికవరీ అవ్వడానికి దాదాపు ఏడాదికి పైగానే సమయాన్ని తీసుకుంది. ఇప్పుడు వరుసగా హిస్టారికల్ చిత్రాలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ బిజీగా మారింది నభా నటేష్. ప్రస్తుతం నిఖిల్ హీరోగా నటిస్తున్న స్వయంభు అనే సినిమాలో హీరోయిన్‌గా నటిస్తోంది. ఇటీవల ఈమె పుట్టినరోజు సందర్భంగా ఈమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను కూడా మేకర్స్ రిలీజ్ చేశారు. సుందరవల్లి పాత్రలో నటిస్తున్నట్లు ఈమె పాత్రను రివీల్ చేశారు. ఎప్పుడో విడుదల కావాల్సిన ఈ సినిమా పలు కారణాలవల్ల వాయిదా పడుతూ వస్తోంది. హిస్టారికల్ బ్యాక్ గ్రౌండ్‌లో వస్తున్న ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో విడుదల కాబోతోంది. ఈ చిత్రాన్ని ఠాగూర్ మధు సమర్పణలో భువన్ శ్రీకర్ నిర్మిస్తున్నారు. రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రంతోపాటు విరాట్ కర్ణ హీరోగా నటిస్తున్న నాగబంధం అనే చిత్రంలో కూడా హీరోయిన్గా నటిస్తోంది. ఒకవైపు గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా మరొకవైపు ఇలా హిస్టారికల్ పాత్రలలో కూడా నటిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుంది. దీనికి తోడు ఒకవైపు సినిమాలలో బిజీగా ఉంటూనే మరొకవైపు సోషల్ మీడియాలో కూడా యాక్టివ్‌గా ఉంటూ ఎప్పటికప్పుడు డిఫరెంట్ ఫోటోషూట్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది నభా నటేష్.

# వారణాసి.. విక్రమార్కుడు తర్వాత ఇప్పుడేనా..



సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శక ధీరుడు రాజమౌళి కాంబినేషన్‌లో వస్తున్న 'వారణాసి' సినిమా మీద రోజురోజుకూ అంచనాలు పెరిగిపోతున్నాయి. గ్లోబల్ స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాలో కాస్టింగ్ విషయంలో జక్కన్న చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. లేటెస్ట్‌గా ఈ సినిమా సెట్‌లోకి విలక్షణ నటుడు ప్రకాష్ రాజ్ అడుగుపెట్టారనే వార్త ఇప్పుడు ఇండస్ట్రీలో ఆసక్తి రేపుతోంది. ఇందులో ఆయన మహేష్ బాబుకు తండ్రి పాత్రలో కనిపించబోతున్నారట. ఈ పాత్ర సినిమాకు చాలా కీలకం అని తెలుస్తోంది. నిజానికి రాజమౌళి ఈ తండ్రి పాత్ర కోసం మొదట ప్రకాష్ రాజ్‌ను అనుకోలేదట. వేరే ఒకరిద్దరు సీనియర్ నటులపై టెస్ట్ షూట్ కూడా నిర్వహించారని టాక్. కానీ వాళ్ళ పర్ఫార్మెన్స్ విషయంలో రాజమౌళికి ఎక్కడో చిన్న అసంతృప్తి ఉండిపోయిందట. తన కథకు, ఆ పాత్రలోని ఎమోషన్ కు ఆ నటులు సరిపోలేదని భావించి, చివరకు ఆ పాత్రను ప్రకాష్ రాజ్ దగ్గరకు తీసుకెళ్లారట. ఆయన సెట్‌లోకి రావడంతో ఆ పాత్రకు నిండుతనం వచ్చిందని యూనిట్ వర్గాల మాట. ఇక్కడ ప్రత్యేకంగా మాట్లాడుకోవాల్సిన విషయం ఒకటుంది. ప్రకాష్ రాజ్ లాంటి గొప్ప నటుడు తెలుగులో దాదాపు అందరు అగ్ర దర్శకులతో పనిచేశారు. పూరీ జగన్నాథ్, వినాయక్, త్రివిక్రమ్, కృష్ణ వంశీ.. ఇలా ఆ జనరేషన్ దర్శకులందరి సినిమాల్లో ఆయన పాత్రలు హైలైట్ గా నిలిచాయి. కానీ విచిత్రంగా రాజమౌళితో మాత్రం ఆయన ట్రావెల్ చాలా తక్కువ. ఇప్పటివరకు వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చింది ఒక్క 'విక్రమార్కుడు' సినిమా మాత్రమే. అప్పట్లో వచ్చిన విక్రమార్కుడు సినిమాలో కూడా ప్రకాష్ రాజ్‌ది మెయిన్ విలన్ పాత్ర కాదు. ఆయన చేసింది చాలా తక్కువ నిడివి ఉన్న పాత్రే. ఆ తర్వాత రాజమౌళి తీసిన మగధీర, ఈగ, బాహుబలి, ఆర్ఆర్ఆర్ వంటి ఏ సినిమాలోనూ ప్రకాష్ రాజ్‌కు అవకాశం రాలేదు. ఇన్నాళ్లకు మళ్లీ 'వారణాసి' సినిమాతో ఈ రేర్ కాంబినేషన్ సెట్ అయ్యింది. అందుకే ఈసారి రాజమౌళి ఆయనకు ఎలాంటి పాత్ర ఇచ్చారనే ఆసక్తి అందరిలోనూ నెలకొంది. టెస్ట్ షూట్స్ చేసి మరీ, వేరే వాళ్లు సరిపోరని ప్రకాష్ రాజ్‌ను తీసుకున్నారంటే.. ఈసారి ఆయన పాత్ర నిడివి, ప్రాధాన్యత కచ్చితంగా ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. విక్రమార్కుడు సినిమాలో లాగా ఏదో వచ్చిపోయే పాత్రలా కాకుండా, కథను మలుపు తిప్పే బలమైన ఎమోషనల్ పాత్ర అయ్యుంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. రాజమౌళి సినిమాల్లో తండ్రి పాత్రలకు ఎప్పుడూ ఒక పవర్ ఉంటుంది. మరోవైపు మహేష్ బాబు, ప్రకాష్ రాజ్ కాంబినేషన్ అంటేనే ఆన్ స్క్రీన్ మ్యాజిక్ అని అందరికీ తెలిసిందే. ఒక్కడు, దూకుడు, సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు వంటి సినిమాల్లో వీరిద్దరి నటన అద్భుతంగా పండింది. ఇప్పుడు ఆ సెంటిమెంట్‌కు రాజమౌళి టేకింగ్ తోడవుతోంది. దాదాపు దశాబ్దన్నర తర్వాత రాజమౌళి సినిమాలో ప్రకాష్ రాజ్ నటిస్తుండటంతో, ఈసారి ఆయన విశ్వరూపం గ్లోబల్ స్థాయిలో చూడొచ్చని ఫ్యాన్స్ ఫిక్స్ అవుతున్నారు.

# ఓ సిగ్నల్ ఇస్తే.. అకిరాతో పాన్ వరల్డ్ సినిమా ఫిక్స్!



టాలీవుడ్‌లో ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకుపోతున్న నిర్మాత టీజీ విశ్వప్రసాద్. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై ఆయన ఏ సినిమా చేసినా చాలా గ్రాండ్‌గా ఉంటుంది. రీసెంట్‌గా ఆయన పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, ఆయన కుమారుడు అకిరా నందన్ గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయ్యాయి. మెగా అభిమానులు ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న అప్డేట్ గురించి ఆయన ఓపెన్‌గా మాట్లాడారు. పవన్ కళ్యాణ్‌తో తనకు ఎప్పటి నుంచో మంచి అనుబంధం ఉందని విశ్వప్రసాద్ గుర్తు చేసుకున్నారు. గతంలో వీరి కాంబినేషన్‌లో బ్రో సినిమా వచ్చింది. అయితే ఇప్పుడు పవన్ రాజకీయాల్లో బిజీగా ఉన్నప్పటికీ, ఆయన మళ్ళీ ఎప్పుడు డేట్స్ ఇచ్చినా సినిమా చేయడానికి సిద్ధంగా ఉన్నానని నిర్మాత తన మనసులో మాట చెప్పారు. పవన్ రేంజ్‌కు తగ్గట్టుగా ఎంత బడ్జెట్ అయినా పెట్టడానికి తాను వెనకాడనని క్లియర్‌గా చెప్పారు. ఇక అందరి దృష్టిని ఆకర్షించిన విషయం ఏంటంటే అకిరా నందన్ ఎంట్రీ గురించి ఆయన చేసిన కామెంట్స్. అకిరాను వెండితెరకు పరిచయం చేయాలనే కోరిక తనకు చాలా బలంగా ఉందని విశ్వప్రసాద్ తెలిపారు. అకిరా హైట్, పర్సనాలిటీ చూస్తుంటే ఒక పర్ఫెక్ట్ హీరో మెటీరియల్ లా కనిపిస్తున్నాడని, అతన్ని లాంచ్ చేసే అవకాశం వస్తే అది తన కెరీర్‌లోనే స్పెషల్ ప్రాజెక్ట్ అవుతుందని ఆయన భావిస్తున్నారు. కేవలం హీరోగా పరిచయం చేయడమే కాదు, ఆ సినిమా ఏ స్థాయిలో ఉంటుందో కూడా ఆయన హింట్ ఇచ్చారు. పవన్ కళ్యాణ్ కనుక గ్రీన్ సిగ్నల్ ఇస్తే ఆ సినిమాను పాన్ ఇండియా లెవెల్ లో కాదు, ఏకంగా పాన్ వరల్డ్ లెవెల్ లో ప్లాన్ చేస్తానని ఛాలెంజ్ చేశారు. అంటే హాలీవుడ్ స్టాండర్డ్స్ లో టెక్నికల్ గా అత్యున్నత స్థాయిలో ఆ సినిమాను నిర్మిస్తానని ఆయన నమ్మకంగా చెబుతున్నారు. నిజానికి అకిరా ఎంట్రీ కోసం ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అకిరా ప్రస్తుతం మ్యూజిక్, మార్షల్ ఆర్ట్స్ మీద ఫోకస్ పెట్టి తన స్కిల్స్ పెంచుకుంటున్నాడు. ఇలాంటి టైమ్ లో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ లాంటి పెద్ద బ్యానర్ నుంచి ఇలాంటి ప్రపోజల్ రావడం నిజంగా ఆసక్తికరమైన విషయం. అయితే దీనికి సంబంధించిన నిర్ణయం మొత్తం పవన్ కళ్యాణ్ చేతిలోనే ఉంది. విశ్వప్రసాద్ మాటలు చూస్తుంటే ఆయన అకిరా ఎంట్రీ కోసం పక్కా ప్లాన్‌తో ఉన్నట్లు అనిపిస్తోంది. పవన్ కళ్యాణ్ ఎప్పుడు ఓకే అంటారా అని ఆయన వెయిట్ చేస్తున్నారు. ఒకవేళ ఈ ప్రాజెక్ట్ కనుక సెట్ అయితే దర్శకుడు ఎవరనేది మరో పెద్ద ప్రశ్న. కాంబినేషన్ ఏదైనా బాక్సాఫీస్ దగ్గర రికార్డులు బద్దలవ్వడం ఖాయం. అకిరా స్క్రీన్ మీద కనిపిస్తే చూడాలని కోరుకునే కోట్లాది మంది అభిమానుల కోరిక ఈ ప్రాజెక్ట్‌తో తీరుతుందేమో చూడాలి.

# వాలెంటైన్స్ డేకి మాస్ కా దాస్ గిఫ్ట్.. ఫంకీ రైడ్ రెడీ!




మాస్ కా దాస్ విశ్వక్ సేన్ ఫ్యాన్స్‌కు ఒక సాలిడ్ సర్ప్రైజ్ దొరికింది. అనుదీప్ కెవి డైరెక్షన్‌లో వస్తున్న 'ఫంకీ' సినిమా రిలీజ్ డేట్ ను మారుస్తూ మేకర్స్ ఒక క్రేజీ అప్డేట్ ఇచ్చారు. ముందుగా ఈ సినిమాను 2026 ఏప్రిల్ లో రిలీజ్ చేయాలని అనుకున్నారు. కానీ సినిమా షూటింగ్, అవుట్ పుట్ అనుకున్న దానికంటే బాగా రావడంతో ఫిబ్రవరి 13నే థియేటర్లలోకి తీసుకు రావాలని ఫిక్స్ అయ్యారు. ప్రేమికుల రోజు సందర్భంగా వాలెంటైన్స్ వీకెండ్‌లో ఈ సినిమా రావడం కచ్చితంగా ప్లస్ అవుతుంది. 'జాతి రత్నాలు' సినిమాతో అందరినీ పొట్టచెక్కలయ్యేలా నవ్వించిన డైరెక్టర్ అనుదీప్, ఇప్పుడు విశ్వక్ సేన్‌తో సినిమా చేయడం ఓ వర్గం ఆడియెన్స్‌లో ఆసక్తి పెరిగింది. సాధారణంగా విశ్వక్ సినిమాల్లో మాస్, యాక్షన్ ఎక్కువగా ఉంటుంది. కానీ ఈసారి ఫుల్ లెంగ్త్ కామెడీ ఎంటర్టైనర్‌తో వస్తున్నాడు. ఈ సినిమాలో విశ్వక్ సేన్ పాత్ర చాలా కొత్తగా ఉండబోతోంది. ఇందులో ఆయన ఒక సినిమా డైరెక్టర్ గా కనిపించబోతున్నాడు. ఇప్పటికే రిలీజ్ అయిన పోస్టర్స్ చూస్తుంటే విశ్వక్ లుక్ చాలా స్టైలిష్‌గా, కొత్తగా ఉంది. పసుపు రంగు షర్ట్ వేసుకుని, చేతిలో వాచ్‌తో చాలా కూల్‌గా కనిపిస్తున్నాడు. ఆ ఆటిట్యూడ్, ఆ బాడీ లాంగ్వేజ్ చూస్తుంటే క్యారెక్టర్ చాలా ఫన్నీగా డిజైన్ చేసినట్లు అర్థమవుతోంది. ఇక ఈ సినిమాతో టాలీవుడ్‌కు కాయదు లోహర్ హీరోయిన్‌గా పరిచయం అవుతోంది. స్క్రీన్ మీద విశ్వక్, కాయదు జోడీ చాలా ఫ్రెష్‌గా కనిపిస్తోంది. వీరిద్దరి మధ్య ఉండే కెమిస్ట్రీ సినిమాకు హైలైట్ అయ్యేలా ఉంది. యూత్‌కు కనెక్ట్ అయ్యే లవ్ స్టోరీకి తోడు, అనుదీప్ రాసే పంచ్ డైలాగులు ఈ జంట మధ్య సన్నివేశాలను మరింత ఎంటర్టైనింగ్‌గా మారుస్తాయని టాక్. ఈ సినిమాకు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. ఆయన ఇచ్చే మాస్ బీట్స్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.

సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్స్‌పై నాగ వంశీ, సాయి సౌజన్య ఈ సినిమాను నిర్మిస్తున్నారు. వీరి బ్యానర్‌లో వచ్చే సినిమాలకు క్వాలిటీ విషయంలో మంచి పేరుంది. ఈ సినిమా కూడా అదే రేంజ్‌లో రిచ్‌గా ఉండబోతోందని తెలుస్తోంది. ఏప్రిల్ నుంచి ఫిబ్రవరికి సినిమాను ప్రీపోన్ చేయడం అంటే అవుట్ పుట్ మీద మేకర్స్‌కు ఎంత నమ్మకం ఉందో అర్థం చేసుకోవచ్చు. సంక్రాంతి హడావుడి తగ్గిన తర్వాత, ఫిబ్రవరిలో వచ్చే క్రేజీ సినిమా ఇదే కావచ్చు. వాలెంటైన్స్ డే మూడ్‌లో లవర్స్‌కు, ఫ్యామిలీ ఆడియెన్స్‌కు ఈ 'ఫంకీ' రైడ్ బాగా కనెక్ట్ అయ్యే ఛాన్స్ ఉంది. మరి ఈసారి మాస్ కా దాస్ నవ్వించి ఎలాంటి హిట్టు కొడతాడో చూడాలి.

# 48వ వార్డులో సమస్య ఎక్కడ ఉంటే అక్కడ ప్రత్యక్షమవుతున్న గంకల కవిత అప్పారావు యాదవ్

**- సమస్యల రహిత వార్డుగా 48వ వార్డును తీర్చిదిద్దడమే గుడ్ మార్నింగ్ గంకల లక్ష్యం - 48వ వార్డు ఇందిరా నగర్ -1, జై భారత్ నగర్‌లో గంకల కవిత అప్పారావు యాదవ్ పర్యటన - ప్రతిరోజు వార్డు ప్రజలకు అందుబాటులో పర్యటన చేస్తూ సమస్యలకు పరిష్కారం చూపుతున్న గంకల**




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** 48వ వార్డులో సమస్య ఎక్కడ ఉంటే అక్కడ 48వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ బీజేపీ ఫ్లోర్ లీడర్,జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ గంకల కవిత అప్పారావు యాదవ్ ప్రత్యక్షమవుతున్నారు. గుడ్ మార్నింగ్ గంకల కార్యక్రమం సమస్యల రహిత వార్డుగా 48వ వార్డును తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఏర్పాటు చేసినట్టు గంకల కవిత అప్పారావు యాదవ్ తెలిపారు. 48వ వార్డు ఇందిరా నగర్ -1,జై భారత్ నగర్‌లో శనివారం స్థానికులతో కలిసి గంకల కవిత అప్పారావు యాదవ్ పర్యటించారు. వార్డును అభివృద్ధి పదంలో ముందుకు తీసుకు వెళ్లడమే గుడ్ మార్నింగ్ గంకల ద్యేయమని పేర్కొన్నారు. ఇందిరా నగర్ -1,జై భారత్ నగర్‌లో మరమ్మతులకు గురి అయిన కాలువలు, డ్రైనేజీలు, రోడ్లను పరిశీలించి త్వరలో వాటి స్థానంలో నూతన రోడ్లు,కాలువలు, డ్రైనేజీలు నిర్మాణం చేపట్టడం జరుగుతుందని హామీ ఇచ్చారు. ఇప్పటికే అభివృద్ధి పనులకు టెండర్లు ముగిసాయని త్వరలో పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. వార్డులో గల ఇందిరా నగర్ -1, జై భారత్ నగర్‌లో దట్టంగా పెరిగిపోయిన పిచ్చి మొక్కలు, చెట్ల కొమ్మలతో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు, అభివృద్ధి పనులకు మరికొన్ని చోట్ల చెట్లు కొమ్ములు అడ్డంగా ఉన్నాయని గుడ్ మార్నింగ్ గంకల కార్యక్రమంలో ఫిర్యాదు అందిందని జివిఎంసి సిబ్బంది, హార్టి కల్చర్ డిపార్ట్మెంట్ సిబ్బందితో కలిసి పేరుకుపోయిన చెత్త,పిచ్చి మొక్కలు, చెట్లు కొమ్మలను తొలగింపు చేపట్టారు. ఈ సందర్భంగా గంకల కవిత అప్పారావు యాదవ్ మాట్లాడుతూ 48వ వార్డులో గల ఇందిరా నగర్ -1, జై భారత్ నగర్‌లో శనివారం స్థానికులతో కలిసి గుడ్ మార్నింగ్ గంకల కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులపై పరిశీలించడం జరిగిందని, మరమ్మత్తులకు గురైన రోడ్లు, కాలువలు, డ్రైనేజీలు నిర్మాణాలకు ఇప్పటికే టెండర్లు పూర్తయ్యాయని, త్వరలో పనులను ప్రారంభిస్తామని, వార్డు ప్రజలకు నూతన రోడ్లు, కాలువలు, మెట్లు, డ్రైనేజీలు నిర్మాణం చేపట్టి అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా వార్డులో పలుచోట్ల పిచ్చి మొక్కలు, కొమ్మలు పెరిగిపోయి వాటి వలన ప్రజలకు ఇబ్బంది కలుగుతున్నాయని పిచ్చి మొక్కలు ఎక్కువగా పెరిగిపోవడం వల్ల దోమలు, కీటకాలు పెరిగి పలు వ్యాధులు ప్రబలుతున్నాయని ఫిర్యాదు అందిందని, అభివృద్ధి పనులకు మరికొన్ని చోట్ల చెట్లు కొమ్ములు అడ్డంగా ఉన్నాయని తక్షణమే జీవీఎంసీ, హార్టికల్చర్ సిబ్బందితో కలిసి వార్డులో పెరిగిపోయిన పిచ్చి మొక్కలను తొలగించడం జరిగిందని పేర్కొన్నారు.

గుడ్ మార్నింగ్ గంకల కార్యక్రమంనకు విరామం అనేది లేదని గుడ్ మార్నింగ్ గంకల కార్యక్రమంలో వచ్చిన ప్రతి పిర్యాదు పరిష్కారం చూపడం జరుగుతుందన్నారు. గుడ్ మార్నింగ్ గంకల కార్యక్రమం ద్వారా ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలు తెలుసుకొని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిం చడం జరుగుతుందన్నారు. వార్డ్ ప్రజలకు ఎటువంటి సమస్య ఏర్పడిన తక్షణమే తనను సంప్రదించాలని అన్నారు. వార్డ్ ప్రజలు పిర్యాదు పట్ల, అభివృద్ధి కార్యక్రమాల కొరకు నిరంతరం శ్రమి స్తున్న వార్డ్ కార్పొరేటర్ గంకల కవిత అప్పారావు యాదవ్ కృషి పట్ల ఇందిరా నగర్ -1, జై భారత్ నగర్ గ్రామస్తులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందిరా నగర్ -1, జై భారత్ నగర్ ప్రజలు ఉన్నారు.

# సిఆర్ఎంటి ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం దీక్షలికు మద్దతు : ఎంటిఏ






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న "ఆత్మగౌరవ దీక్ష" కార్యక్రమానికి సంఘీ భావ మద్దతు మహాజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ నిలుస్తుందని రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మస్తాన్ చేమూరు మాదిగ మాదిగ తెలిపారు. ఈ సందర్బంగా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మస్తాన్ చేమూరు వారు మాట్లాడుతూ ఏపి సిఆర్ఎం టీచర్స్ యునైటెడ్ ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ సోమవారం, రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టరేట్ కార్యాలయాల ముందు "ఆత్మగౌరవ దీక్ష"ను నిర్వహించటం జరుగుతోంది. సిఆర్ఎంటి ఉపాధ్యాయులు ఎన్నో ఏళ్ళుగా ఎదురుచూస్తున్న న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఈ దీక్షను చేపడుతున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లవలసిన 12 ప్రధాన డిమాండ్లు : ఏ-బి క్లస్టర్ విధానాన్ని రద్దు చేయాలి. సమగ్ర శిక్షలో పిఏబి ఆమోదం & జిఓ 65 ప్రకారం అమలు చేస్తున్న ఏ మరియు బి క్లస్టర్ విధానాన్ని రద్దు చేయాలి. లేదా అందరికీ ఒకే కేటగిరీ అమలు చేయాలి. కేటగిరీల పునర్విభజన విద్యార్థుల సంఖ్య ఆధారంగా చేయాలి. జిల్లాలో ఉన్న సిఆర్ఎంటి పోస్టులను 50-100% మేరకు స్థానికంగా భర్తీ చేసే అవకాశం కల్పించాలి. C.R.M.T.లను విద్యాశాఖలో విలీనం చేసి, రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలి. G.O.Ms.No.65 ప్రకారం వేతనం అమలు. 4034 మంది C.R.M.T.లకు ఆమోదించిన 44,570/- వేతనం (పిఆర్‌సి సహా) వెంటనే అమలు చేయాలి. ఒకే రోజు ముగ్గురు అధికారులకు జవాబుదారీ అనే గందరగోళాన్ని తొలగించాలి. ప్రస్తుతం సిఆర్ఎంటిలు క్లస్టర్ HM, MEO-1, MEO-2 ముగ్గురికి జవాబుదారులు కావలసి రావడం వల్ల అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. అందువల్ల ఒక్క అధికారికే జవాబుదారిగా నియమిస్తూ స్పష్టమైన జాబ్ చార్ట్ ఇవ్వాలి. ట్రావెలింగ్ అలవెన్సులు ఫీల్డ్ లెవెల్‌లో పనిచేస్తున్నందున C.R.M.T లకు T.A. (Travelling Allowances) మంజూరు చేయాలి.

డిఎస్సీలో వెయిటేజ్

పాఠశాల విద్యా సమాఖ్యలో పని చేస్తున్న C.R.M.T.లకు డిఎస్సీలో Weightage ఇవ్వాలి.

ఉద్యోగ భద్రత (Job Security): సిఆర్ఎంటిలకు పూర్తి స్థాయిలో ఉద్యోగ భద్రత కల్పించాలి.

Increment enhancement: సిఆర్ఎంటిల ఇన్‌క్రీస్‌మెంట్‌ను 62% వరకు పెంచి, సంబంధిత సర్వీస్ బెనిఫిట్స్ అందించాలి. పిఎఫ్, ఇఎస్ఐ ఇతర ఉద్యోగుల మాదిరిగా పిఎఫ్, ఇఎస్ఐ సదుపాయాలు కల్పించాలి. ఎక్స్‌గ్రేషియా (10 లక్షలు). విధులు నిర్వర్తిస్తున్న సమయంలో మరణించిన సిఆర్ఎంటిలకు ప్రభుత్వం ప్రకటించిన 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రయోజనం వర్తించేలా అర్హత కల్పించాలి. సిఆర్ఎంటి టీచర్స్ హక్కుల కోసం గౌరవం కోసం ఉద్యోగ భద్రత కోసం - నిర్వహిస్తున్న ఈ "ఆత్మగౌరవ దీక్ష" కార్యక్రమానికి మహాజన టీచర్స్ అసోసియేషన్ సంఘం తరపున సంఘీభావ మద్దతు ప్రకటిస్తున్నామని మా ఎంటిఏ సంఘ సభ్యులు పాల్గొనేలా ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటామని ఒక ప్రకటనలో తెలియజేడం జరిగింది. ఈ కార్యక్రమం లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూడల పెంచలయ్య, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి మరియు తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ గొర్రిపాటి పీరయ్య రాష్ట్ర మహిళా కార్యదర్శి కాకుమాని జ్యోతి పాల్గొన్నారు.

# ఘనంగా బాప్టిస్ట్ ఫీల్డ్ కౌన్సిల్ క్రిస్మస్ వేడుకలు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** క్రైస్తవ సోదరులు, పాస్టర్లు ఐక్యత కలిగి ఉండాలని, సామర్లకోట మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజెస్ అన్నారు. శనివారం సామర్లకోట బుధవారం మార్కెట్ వద్ద గల సెంటినరీ బాప్టిస్ట్ సంఘం నందు సామర్లకోట ఫీల్డ్ కౌన్సిల్ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఫీల్డ్ కౌన్సిల్ అధ్యక్షులు కే.సంజీవరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాన్ని నిర్వహించగా ముఖ్య అతిథిగా మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజెస్ హాజరై మాట్లాడుతూ ఇటీవల క్రైస్తవులపై, చర్చిలపై దాడులు జరుగుతున్నాయని, అటువంటి సమయంలో క్రైస్తవులు అందరూ ఐక్యతతో కలిసి ఉండి ఖండించి, వారికి అండగా నిలబడాలని పేర్కొన్నారు. అనంతరం సెంటినరీ బాప్టిస్ట్ సంఘం కాపరి జి.మోజెస్ కుమార్ దైవ సందేశాన్ని అందజేసారు. అంతకుముందు ఈ క్రిస్మస్ వేడుకలకు ముఖ్య అతిథులుగా కార్మిక సంఘం నాయకులు, సీనియర్ వైసిపి నాయకులు దవులూరి సుబ్బారావు, హాజరై క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పాటలు పోటీలు, బైబిల్ క్విజ్ నిర్వహించి ముఖ్య అతిథులు చేతులు మీదుగా బహుమతి ప్రదానం నిర్వహించారు.

అనంతరం కేక్ కటింగ్ నిర్వహించి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ కౌన్సిల్ కార్యదర్శి యం.డి.వి.ప్రసాద్, ఆర్.విజయ్ కుమార్, ఐ.ఈ జీవన్ కుమార్, యు.నూకరాజు, జి.జాన్, ఎన్.మోషే, పాస్టర్లు ఏం.సల్మాన్ రాజ్, బి.జాన్ బాబు, బీవీ రాజు, వి.జాన్, ఆర్.లాజర్స్, ఏం.ఎ జేమ్స్, సల్లూరి కళ్యాణ్, పిట్టా సత్యనారాయణ వివిధ సంఘాల పాస్టర్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# సకాలంలో వైద్య సహాయం అందించిన రాష్ట్ర ఎన్టీఆర్ వైద్య సేవ చైర్మన్ సీతంరాజు సుధాకర్

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖ దక్షిణ నియోజకవర్గం స్థానిక 29వ వార్డులో కన్నయ్య పేట బూత్ కన్వీనర్ పసుపులేటి అప్పలరాజు తల్లి ప్రమాదవశాత్తు మెట్ల మీద నుండి జారిపడి చెయ్యి విరగగా విషయం తెలుసుకున్న సీతం రాజు సుధాకర్ వెను వెంటనే సాగర్ దుర్గ హాస్పిటల్‌కి ఫోన్ చేసి వారికి ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా మెరుగైన డాక్టర్లతో సర్జరీ చేయించారు. అనంతరం 29వ వార్డు కార్పొరేటర్ ఉరి కిటి నారాయణరావుతో కలిసి హాస్పిటల్‌కి వెళ్లి వారిని పరామ ర్శించి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను ఆదేశించారు. సకాలంలో స్పందించి మెరుగైన వైద్యం అందించి ఆదుకున్న సీతంరాజు సుధాకర్‌కి కన్నయ్య పేట బూత్ కన్వీనర్ అప్పలరాజు మరియు వారి



కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు.

# ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ సమావేశంలో జమ ఖర్చుల వివరాలు నూతన కార్యవర్గన్ని ఎన్నుకోవడం జరిగినది. అధ్యక్షులుగా షేక్ నసీర్ అహ్మద్ కార్యదర్శిగా శానంపూడి సుబ్బరాయుడు కోశాధికారిగా సితారి రత్నయ్య గౌరవాధ్యక్షులుగా బిరుదవోలు రామ్మోహన్ రెడ్డి ఏకగ్రీవంగా ఆమోదించడం అయినది. ఈ ఎన్నికకు ఎలక్షన్ ఆఫీసర్‌గా వినుకొండ వెంకటేశ్వర్లుని నియమించి తద్వారా ఎన్నుకోవడమైనది. ఈ కార్యక్రమమునకు అధ్యక్షుడు కిలారి శ్రీనివాసులు నాయుడు కార్యదర్శి గువ్వల నారాయణరెడ్డి కోశాధికారి మాగంటి ప్రసాదు ఎలెక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్య నాయుడు ఆర్సి ఎలెక్ట్ పలగాటి శ్రీనివాసులు రెడ్డి బెల్లం చెంచయ్య నాయుడు కాగుళ్ల శివయ్య మారుతి రావు, జీ వి కృష్ణయ్య, ఏ వి సుబ్బరాజు, కొప్పు కోదండ రామయ్య, మధుసూదనరావు, సోను, వెంకటరాజు మొదలగువారు పాల్గొని కార్యక్రమంను జయప్రదం చేయడం జరిగింది.

# సిఐటియు మహాసభ విజయవంతం చేయండి

## - పెద్దాపురంలో సిఐటియు ప్రచారం

**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** ఈనెల 31 నుండి జనవరి 4వ తేదీ వరకు విశాఖ పట్నంలో జరుగుతున్న సిఐటియు 18వ అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో పెద్దాపురం మెయిన్ రోడ్‌లో శనివారం ప్రచార కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి క్రాంతి కుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్లో మొదటిసారి సిఐటియు అఖిల భారత మహాసభ నిర్వహిస్తున్నామన్నారు.

ఈ నెల 27వ తేదీ నుండి శ్రామిక ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని, కార్మికులు కళారూపాలలోని ప్రదర్శిస్తారని తెలిపారు. డిసెంబర్ 31న మహాసభల ప్రారంభమై జనవరి 4వ తేదీన భారీ బహిరంగ సభ విశాఖ ఆర్కే బీచ్‌లో జరుగుతుందన్నారు. దీనిని విజయ వంతం చేయాలని కోరారు. కార్మిక హక్కుల కోసం పని గంటల పెంపుదలకు వ్యతిరేకంగా, లేబర్ కొడ్లకు వ్యతిరేకంగా పనిచేస్తున్న సిఐటియు మహా సభలు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్ర మంలో సిఐటియు




మండల అధ్యక్షులు గడిగట్ల సత్తిబాబు, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షులు టీ ఎల్ పద్మ, చల్లా స్నేహలత, సావిత్రి, భాను, రత్నం, లక్ష్మి, సత్య, రొంగల సుభలక్ష్మి, సీఐటీయూ నాయకులు మాగపు నాగు, సిరిపురపు మరిడియ్య, తెనాలా శ్రీను, గరగపటి పెంటయ్య, కేదారి నాగు, సుబ్రమణ్యం, యాసలపు రమేష్, జాగరపు కుమారి, నెక్కల నరసింహ మూర్తి, సిరిపురపు శ్రీనివాస్, నీలపాల సూరిబాబు అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

# రత్నగిరికి పోటెత్తిన భక్తులు



**అన్నవరం, (రాజధాని వార్తలు):** కాకినాడ జిల్లా అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి సన్నిధిలో చండీ భక్తులతో సందడి నెలకొంది. మాఘమాసం మహా పర్వదినం శనివారం కావడంతో ఆలయ ప్రాంగణం, వ్రత మండపాలు, దర్శన క్యూలైన్‌లు చండీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. దేవస్థానం అధికారులు తెల్లవారుజామున నాలుగు గంటల నుండి వ్రత టిక్కెట్లు, దర్శనం టిక్కెట్లు ఇవ్వడం ప్రారంభించారు. భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా దేవస్థానం అధికారి వేంద్ర త్రినాథ రావు అధికారులకు తగిన సూచనలు ఇస్తూ, దర్శన క్యూలైన్లలో మంచినీరు, చిన్న పిల్లలకు పాలు పంచిపెట్టారు. ఎక్కడ ఏ విధమైన అసౌకర్యములు కలగకుండా భక్తులు దర్శనానంతరం అన్నదానం ట్రస్టులో భోజనాలు అందజేశారు. ఈరోజు స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను, తిరుచ్చి వాహనంపై ఆశీనులు గావింపజేసి సుగంధ పరిమళ భరితమైన పూలతో అలంకరించి అనంతరం స్వామి అమ్మవార్లను మాడవీధుల్లో ముమ్మారు ప్రదక్షిణ గావించారు. ఈ కార్యక్రమంలో ఈవో వేంద్ర త్రినాథరావు, సూపరింటెండెంట్, అధికారులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

# 2002-2005 ఓటర్ల సరిపోల్చే ప్రక్రియను వేగవంతం చేయాలి

## - బూత్ లెవెల్ అధికారులకు ఇంచార్జ్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ ఆదేశాలు



**కాకినాడ, (రాజధాని వార్తలు):** 2002 సంవత్సరంలో నమోదైన ఓటర్ల వివరాలను 2005 సంవత్సరంతో సరిపోల్చే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కాకినాడ నగరపాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ బూత్ లెవెల్ అధికారులకు ఆదేశించారు. స్పెషల్ ఇన్సెంటివ్ రీజన్ విధానం ద్వారా ఓటర్ల వివరాల సరిపోల్చే ప్రక్రియను పారదర్శకంగా, ఎటువంటి అవకతవకలు లేకుండా చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో భాగంగా శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక శిబిరాలను ఆయన శనివారం కాకినాడ నగరంలోని అన్నదాన సమాజంలో పరిశీలించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో బిఎల్వోలు విధులు ఏ విధంగా నిర్వహిస్తున్నారో స్వయంగా పరిశీలించి పోలింగ్ కేంద్రాల వారీగా ఆయా ఓటర్ల వివరాలను ఖచ్చితంగా సరిపోల్చాలని సూచించారు. అలాగే క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను తమ దృష్టికి తీసుకు రావాలని బిఎల్వోలకు తెలిపారు. స్పెషల్ ఇన్సెంటివ్ రీజన్ విధానం ద్వారా ముందస్తు ఏర్పాట్లకు మంచి అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఓటర్ల డేటాను పూర్తిస్థాయిలో సరి చేయాలని ఆయన పేర్కొన్నారు. అలాగే కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్, ఈఆర్ఓ కేటి సుధాకర్ కూడా నగరంలోని శ్రీరామ్‌నగర్, వెంకట్‌నగర్, గాంధీనగర్, జగన్నాథపురం, డైరీ ఫారం సెంటర్‌లోని రాజు గృహకల్ప సముదాయంలో ఉన్న పోలింగ్ బూత్లను సందర్శించారు. డోర్ టు డోర్ సర్వే ప్రక్రియను పరిశీలించి, బిఎల్వోలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తాసిల్దార్ గోవిందు, బూత్ లెవెల్ అధికారులు (బిఎల్వోలు) తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడ నగర అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన

## - కాకినాడ నగర అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం

## కావాలి : శాసనసభ్యులు వనమాడి కొండబాబు





**కాకినాడ, (రాజధాని వార్తలు):** కాకినాడ నగర అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పరిపాలన కొనసాగిస్తుందని, కాకినాడ నగర ప్రముఖుల సలహాలు సూచనలతో రాబోయే కాలంలో కాకినాడ నగరాన్ని మరింత అభివృద్ధి చేయడం జరుగుతుందని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. శనివారము స్థానిక సరోవర్ పోర్టుకో హెూటల్‌నందు నగర ప్రముఖులు, మేధావులు, వ్యాపార వర్గ నేతలు, నగర పాలక సంస్థ అధికారులతో కలిసి శాసనసభ్యులు వనమాడి కొండబాబు ఆత్మీయ సమావేశం నిర్వహించి వారి సలహాలు సూచనలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ ప్యారడైజ్ సిటీగా పిలవబడే కాకినాడ నగరాన్ని రాబోయే కాలంలో మరింత అభివృద్ధి పరచడం జరుగుతుందని, కాకినాడ నగర అభివృద్ధిలో నగర ప్రముఖులు, మేధావులు, వ్యాపార వర్గాలు భాగస్వామ్యమై సహకరించాలని, పారిశుధ్యం, ట్రాఫిక్, రోడ్ మరియు డ్రైనేజీ వ్యవస్థ తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా నగర ప్రముఖులు మాజీ పార్లమెంట్ సభ్యులు చిట్టూరి రవీంద్ర, కాకినాడ సిపోర్ట్స్ సీఈవో మురళీధరన్, గట్టి సత్యనారాయణ, వై.డి. రామారావు, గ్రంధి నారాయణరావు, తదితరులు కాకినాడ నగర అభివృద్ధి ప్రాణాలకులపై వారి సలహాలు సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ సత్యనారాయణ, డాక్టర్ వడ్రేవు రవి, డాక్టర్ ఆనంద్, బాదం సుందర్రావు, గాదం మహేష్, ఇంజనీర్ రాజశేఖర్, చోడే అనిల్, నెక్కంటి శ్రీనివాస్, మల్లిపూడి వీరు, జవహర్ అలీ, బచ్చు శేఖర్, వక్కలంక రామకృష్ణ, చిట్ల కిరణ్, లోటస్ సత్యకుమార్, మూర్తి, చంద్రశేఖర్, బచ్చు శేఖర్, హెల్త్ ఆఫీసర్ పృధ్వి చరణ్, ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా ప్రారంభమైన నారాయణ ప్రీమియర్ లీగ్ పోటీలు

## - చదువుతోపాటు క్రీడా పోటీలలో రాణించాలని ఆర్డీవో నాగ అనూష సూచన











**నెల్లూరు, (రాజధాని వార్తలు):** విద్యార్థులు చదువుతోపాటు క్రీడా పోటీల్లో కూడా రాణించాలని నెల్లూరు ఆర్డీవో నాగ అనూష పేర్కొన్నారు. ఆదివారం నగరంలో స్థానిక నారాయణ మెడికల్ కళాశాల క్రీడా మైదానంలో నారాయణ ప్రీమియర్ లీగ్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నెల్లూరు రెవెన్యూ డివిజనల్ అధికారి ని నాగ అనూష హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడా పోటీలలో కూడా రాణించాలన్నారు. విద్యార్థి దశలో తాను కూడా ఇటువంటి క్రీడా పోటీల్లో పాల్గొనాలని గుర్తు చేశారు. ఇటువంటి పోటీల ద్వారా విద్యార్థుల్లో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం లభిస్తుందని ఆమె తెలిపారు. ఏజీఎం రవి వర్మ మాట్లాడుతూ నారాయణ విద్యాసంస్థల్లో విద్యార్థులకు చదువుతోపాటు వివిధ రకాల క్రీడా పోటీలు, యోగ, స్కిల్ డెవలప్మెంట్ వంటి కార్యక్రమాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని అన్నారు.

రెండు రోజులపాటు జరిగే ఈ లీక్ పోటీలలో నారాయణ విద్యాసంస్థల పాఠశాలల విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటుకోనున్నారనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐఆదిశేషయ్య కోఆర్డినేటర్ రాఘవరెడ్డి ప్రిన్సిపాల్ సుధీర్ కిరణ్ నాగమణి మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాల ను ఆకస్మిక తనిఖీ చేసిన బొజ్జల బృందమ్మ





**రేణిగుంట, (రాజధాని వార్తలు):** రేణిగుంట గురుకుల పాఠశాలను మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి, ఎమ్మెల్యే తల్లి బొజ్జల బృందమ్మ ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న వసతి సదుపాయాలు, భోజన నాణ్యత, విద్యా ప్రమాణాలపై సమగ్ర తనిఖీ చేశారు. హాస్టల్ గదులు, డైనింగ్ హాల్, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలను పరిశీలించారు. తరగతుల నిర్వహణ, విద్యార్థుల హాజరు పట్టికలు, పరిశుభ్రత అంశాలపై సమీక్షించారు. విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలు తెలుసుకున్న బొజ్జల బృందమ్మ, భోజన నాణ్యత మెరుగుపరచాలని, హాస్టల్ పరిసరాల్లో శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచనలు చేశారు. విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, చదువులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు.

గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు చేశారు. గురుకుల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యమని వ్యాఖ్యానిచారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యం



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని విశాఖ జిల్లా ఇంఛార్జి మంత్రి డా.డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. శనివారం విశాఖ ఉత్తర నియోజకవర్గంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుతో కలిసి ఇల్ల పత్రాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి స్వామి పాల్గొన్నారు. ఈ సందరరేగా ఆయన మాట్లాడుతూ సెంటు భూముల్లో ఆప్షన్-3 గృహాలు స్వాధీన పత్రాలు అందజేయడంలో ఎమ్మెల్యే విష్ణుకు మార్ రాజు కృషి అభినందనీయం. మీరు వెళ్లే ప్రాంతాలు కూడా భవిష్యత్తులో అభివృద్ధి చెందుతాయి. అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారు. విశాఖ ఎకనామిక్ రీజియన్ డెవలప్మెంట్‌పై సీఎం చంద్రబాబు నాయుడు 9 జిల్లాల కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయటానికి సంసిద్ధంగా ఉన్నారు. కేంద్రం ఇచ్చిన ఇల్లు కూడా గత వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయలేకపోయింది. నేడు కూటమి ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణం కోసం అదనంగా ఎస్సీ, బీసీలకు రూ. 50 వేలు, ఎస్టీలకు రూ. 75 వేలు, మరీ వెనుకబడిన వారికి రూ. 1 లక్ష చొప్పున సాయం చేస్తోంది. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలు అమలు చేస్తున్నాం. వృద్ధులకు పింఛను రూ. 200 నుంచి రూ. 2 వేలు, రూ. 2 వేల నుంచి రూ. 4 వేలకు పెంచిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుదే పింఛన్ రూ. 1000 పెం చడానికి జగన్‌కి 5 ఏళ్లు పట్టింది. ఆడపడుచులకు స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాం. దీపం -2 పథకం కింద ప్రతి ఇంటికి సంవత్సరానికి 3 గ్యాస్ సిలెండర్ల చొప్పున ఉచితంగా ఇస్తున్నాం. ఇచ్చిన హామీలను అమలు పరుస్తున్నాం. అన్నా క్యాంటిన్లల్లో ఎవరైనా సరే 5 రూపాయలకే భోంచేసే సదుపాయం కల్పించాం. తల్లికి వందనం కింద ఎంతమంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం ఇచ్చాం. ఆరుగురు పిల్లలున్న వారికి కూడా డబ్బులొచ్చాయి. ఇలా చెప్పినవన్నీ చేసుకుంటూ వెళ్తున్నాం. రేపు ఎస్సీ, బీసీలందరికి ఇళ్లపై సోలార్ కరెంటు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, అన్ని వర్గాల సంక్షేమ లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని మంత్రి డా.డోలా బాల వీరాంజనేయస్వామి తెలిపారు.

# కాపునాడు పొదిలి పట్టణ అధ్యక్షునిగా కాశీ విశ్వనాధ్



**ఒంగోలు, (రాజధాని వార్తలు):** ఒంగోలు కాపునాడు కార్యాలయంలో జరిగిన సమావేశం సందర్భంగా మార్కాపురం నియోజకవర్గం పరిధిలో గల పొదిలి టౌన్‌కు సంబంధించి పట్టణ ప్రెసిడెంట్‌గా వెలుగోలు కాశీ విశ్వనాథ్‌ను అధికారికంగా నియమించినట్లు ఒంగోలు పార్లమెంట్ కాపునాడు అధ్యక్షుడు పి.మల్లికార్జున శనివారం ప్రకటించారు. ఈ బాధ్యతను స్వీకరించిన కాశీ విశ్వనాథ్ కాపు సమాజం అభివృద్ధి, ఐక్యత, స్వాభిమానాన్ని మరింతగా పెంపొందించే దిశగా కట్టుబడి పని చేస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కాపునాడు కార్యకలాపాలను పట్టణ స్థాయి నుండి బలోపేతం చేయడానికి అందులో ముఖ్యంగా యువత భాగస్వామ్యాన్ని పెంచడానికి, సమాజానికి అవసరమైన సేవలు అందించడానికి కాశీ విశ్వనాథ్ నాయకత్వం కాపునాడుకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆశిస్తున్నామన్నారు. కొత్తగా బాధ్యతలందుకున్న వెలుగోలు కాశీ విశ్వనాథ్‌కు సహచర కాపునాడు నాయకులు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ పొదిలి పట్టణ కాపు నాడు కార్యకర్తలు తమ పూర్తి సహకారం ఆయనకు అందించగలరని మల్లికార్జున విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా కాపునాడు అధ్యక్షులు పోగులు మల్లికార్జునరావు, జనరల్ సెక్రటరీ దాసరి పిచ్చయ్య నాయుడు, జిల్లా యువజన అధ్యక్షులు బండారు సురేష్, ఉపాధ్యక్షులు చెంగలశెట్టి సుధాకర్, గారా నారాయణ, ఒంగోలు నగర మహిళా అధ్యక్షురాలు నగుబోతు నిర్మల, కాపునాడు మహిళా నేతలు తోట కృష్ణవేణి, లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

RAJADHANI CLASSIFIEDS Ad. Call
9440662699, rajadhanivartalu.com

EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మండడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పొస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎక్ష్ప్లానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699

# 'ఫ్యూచర్ రెడీ ఇన్‌స్టిట్యూషన్ అవార్డ్' అందుకున్న ఆదిశంకర విశ్వవిద్యాలయం




**గూడూరు, (రాజధాని వార్తలు):** భారత్ భవిష్యత్తుకు అనుగుణ మైన ఉన్నత విద్యా వ్యవస్థల నిర్మాణంలో తన దూరదృష్టి నాయకత్వం, నిరంతర కట్టుబాటుకు గాను ఆడిసంకర (డీమ్డ్ టు బీ) విశ్వవిద్యాలయంకు ఈ టి టెక్ ఎక్స్ సంస్థ ప్రతిష్టాత్మకమైన ఫ్యూచర్ రెడీ ఇన్‌స్టిట్యూషన్ అవార్డ్‌ను ప్రదానం చేసింది. ఈ అవార్డు 2025 డిసెంబర్ 11 నుంచి 13 వరకు హైదరాబాద్‌లోని హైటెక్స్ కన్వెన్షన్ సెంటర్లో నిర్వహించిన ఈ టి టెక్ ఎక్స్ మూడు రోజుల జాతీయ సదస్సు సందర్భంగా అందజేయబడింది. ఈ సదస్సులో దేశవ్యాప్తంగా ప్రముఖ విద్యా సంస్థలు, విధాన నిర్ణయకర్తలు, సాంకేతిక నిపుణులు, విద్యారంగ నాయకులు పాల్గొన్నారు. క్వాంటమ్ అప్లికేషన్స్, కృత్రిమ మేధస్సు (ఏఐ) మరియు లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ ఏరోస్పేస్ మరియు అంతరిక్ష సాంకేతికతలు, అలాగే భారతీయ జ్ఞాన సంప్రదాయాలు వంటి ఆధునిక రంగాల్లో అకడమిక్ మరియు పరిశోధనా సామర్థ్యాలను అభివృద్ధి చేయడంలో ఆదిశంకర విశ్వవిద్యాలయం చూపిన నాయకత్వానికి ఈ అవార్డు గుర్తింపుగా నిలుస్తుంది. భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన అభ్యాస వాతావరణాన్ని సృష్టించడంలో విశ్వవిద్యాలయం చేసిన కృషిని ఇది ప్రతిబింబిస్తుంది. ఈ అవార్డును చైర్మన్ వంకి పెంచలయ్య తరపున ప్రో వైస్ చాన్సలర్ డా.టి.పి.శశికుమార్ స్వీకరించారు. ఈ సందర్భంగా టెలిఫోన్ ద్వారా స్పందించిన చైర్మన్ వంకి పెంచలయ్య మాట్లాడుతూ "ఈ ప్రతిష్టాత్మక అవార్డు లభించడం ఎంతో గర్వకారణం. గ్రామీణ ప్రాంతాలు, వెనుకబడిన వర్గాలు, ఆశావహ యువతకు ప్రపంచ స్థాయి విద్యను అందించి వారి లక్ష్యాలను సాధించేందుకు మేము చూపుతున్న కట్టుబాటును ఇది మరింత బలపరుస్తుంది." అదనంగా ఆయన మాట్లాడుతూ హెచ్ ఈ ఐ సీ 2025 ఎడ్యుకేషన్ బిల్, వికసిత్ భారత్ శిక్ష అధిక్షణ్ దృక్పథానికి అనుగుణంగా, మరింత కఠినమైన, ఆధునిక పాఠ్య ప్రణాళికలతో భవిష్యత్‌కు సిద్ధమైన క్యాంపస్‌లను నిర్మించేందుకు ఈ గుర్తింపు మాకు మరింత ప్రోత్సాహం ఇస్తుంది. ఆవిష్కరణ, సమగ్రత అకడమిక్ ఉత్తమత మా ప్రధాన లక్ష్యాలుగా కొనసాగుతాయి." ఫ్యూచర్ రెడీ ఇన్‌స్టిట్యూషన్ అవార్డ్ అనేది, ఆధునిక సాంకేతికతలు, భారతీయ జ్ఞాన సంప్రదాయాలు మరియు సమగ్ర విద్యా విధానాలను సమన్వయపరిచి విద్యార్థులను వేగంగా మారుతున్న జాతీయ మరియు గ్లోబల్ పరిసరాలకు సిద్ధం చేయాలనే ఆదిశంకర విశ్వవిద్యాలయం లక్ష్యానికి నిదర్శనమన్నారు.

# ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు

## - ఉడతా శరత్ యాదవ్ చేతుల మీదుగా క్రిస్మస్ కానుకలు పంపిణీ




**గూడూరు, (రాజధాని వార్తలు):** గూడూరు పట్టణంలోని ఇందిరా నగర్‌లో గుడ్ షెపడ్ మినిస్ట్రీస్ సంస్థ ఆధ్వర్యంలో ట్రస్ట్ ఆవరణంలో శనివారం ప్రీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులకు పాటలు, ఆటల పోటీలు నిర్వహించి క్రిస్మస్ కానుకలను అందజేశారు. ఈ కార్యక్రమానికి "యునైటెడ్ హ్యాండ్స్ సొసైటీ ఫర్ ది పీపుల్" సొసైటీ కార్యదర్శి ఉడతా శరత్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు ఆయన చేతులు మీదుగా చిన్నారులకు కానుకలు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ సంఘ సేవకులు ముద్దా అబ్రహాం స్ఫూర్తితో వారి కుమారుడు ముద్దా జీవన్ శామ్యూల్ ఫౌండర్ చైర్మన్‌గా "గుడ్ షెపర్డ్ మినిస్ట్రీస్" అనేక సేవా కార్యక్రమాల ద్వారా సమాజ సేవలు అందిస్తున్నారన్నారు. ముఖ్యంగా విద్యా విషయాలలో అనేక మంది నిరుపేద విద్యార్థులకు చేయూతను అందిస్తుండడం ప్రశంసనీయం అన్నారు. ఏసు క్రీస్తు జీవితాన్ని, భోదనలను ఆదర్శంగా తీసుకుని గుడ్ షేపర్డ్ సంస్థ నిర్వాహకులు జీవన్ శామ్యూల్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయం అన్నారు. ప్రత్యేక ఆహ్వానితులు ఉపాధ్యాయులు ఎంట్రపాటి మురార్జీ మాట్లాడుతూ ఏసుక్రీస్తు సమాజానికి త్యాగం, సమానత్వం అందించాలనే సందేశాన్ని అందరూ అనుసరించాలన్నారు. అనంతరం చిన్నారులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి ఉడతా శరత్ యాదవ్, ప్రత్యేక ఆహ్వానితులు ఎంట్ర పాటి మురార్జీ గుడ్ షేపర్డ్ మినిస్ట్రీస్ సెక్రటరీ ముద్దా దివ్య, ప్రవీణ్, డేవిడ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# హెల్మెట్ లేదంటే జరిమానా రూ. 1000





**రేణిగుంట, (రాజధాని వార్తలు):** రేణిగుంట పట్టణం నందు గల అంబేద్కర్ కూడలి వద్ద రేణిగుంట అర్బన్ సీఐ జయ చంద్ర మరియు ఎస్ఐ ధర్మారెడ్డి మరియు పోలీసు సిబ్బంది ద్విచక్ర వాహనదారుల హెల్మెట్ ధారణపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులకు రేపటినుండి తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేదంటే పెట్రోల్ బంకులలో పెట్రోల్ ఇవ్వరనీ సీఐ స్పష్టం చేశారు. హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులకు 1000 రూపాయలు జరిమానా ఉంటుందని స్పష్టం చేశారు. అదేవిధంగా యువతకు దిశా నిర్దేశం చేస్తూ మీ ప్రాణాలు మీ కుటుంబ సభ్యులకు ఎంతో అవసరమని, మీరు ఏదైనా ప్రమాదానికి గురైనప్పుడు మీ కుటుంబం ఆర్థికంగా చిన్న భిన్నం అవుతుందనీ యువతకు తెలియజేశారు.

హెల్మెట్ ధరించడం వల్ల ప్రయోజనాలను ఈ సందర్భంగా సిఐ జయచంద్ర, ఎస్సై ధర్మారెడ్డి మరియు పోలీస్ సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.

# ఘనంగా వడ్లతాంగల్ చెంగల్రాయరెడ్డి 6వ వర్ధంతి వేడుకలు

**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** వడ్లతాంగల్ చెంగల్రాయరెడ్డి పేదల పక్షపాతి అని ఆయన తనయుడు, ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వడ్లతాంగల్ బాలాజీ ప్రసాద్ రెడ్డి చెప్పారు. వడ్లతాంగల్ చెంగల్రాయరెడ్డి ఆరవ వర్ధంతి వేడుకలు శనివారం శ్రీకాళహస్తిలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చెంగల్రాయరెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నారు. ఈ సందరరేగా వడ్లతాంగల్ బాలాజీ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ తన తండ్రి వడ్లతాంగల్ చెంగల్రాయరెడ్డి ఎపుడూ పేదల గురించి ఆలోచించే వారన్నారు. పేదలకు సాయం చేస్తూ దయాగుణం చాటుకునే వారన్నారు. కష్టాల్లో ఉన్న వారు ఎవరు వచ్చినా వారికి సాయం చేయడం ఆయన గుణం అన్నారు. అందుకే తన తండ్రి చెంగల్రాయరెడ్డి శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ప్రత్యేక గుర్తింపు పొందారన్నారు. తన ఇంటికి వచ్చిన పేదలకు ఆకలి తీర్చకుండా ఆయన పంపేవారు కాదన్నారు. అందుకే ఆయన వర్ధంతి రోజున వందలాది మంది పేదలకు అన్నదానం చేస్తున్నామన్నారు.




వర్ధంతి వేడుకలకు హాజరైన వారికి వడ్లతాంగల్ బాలాజీ ప్రసాద్ రెడ్డి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంజూరు తారక శ్రీనివాసులు, హేమభూషణ రెడ్డి, పఠాన్ ఫరీద్, మునికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan